# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 230

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: గురువారం 24 సెప్టెంబర్ 2026


2వ పేజీలో...




## కాంగ్రెస్ అగ్ర నేతల ఆగ్రహం!



## బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌లు వీరే..

**సమయం ప్రతినిధి:** బీజేపీలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు పార్టీ ఇన్‌ఛార్జ్‌లు, కో-ఇన్‌ఛార్జ్‌లను అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ బుధవారం ఈ నియామకాలను ప్రకటించారు. అందులో భాగంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీకి హరియాణా, ఛత్తీస్‌గఢ్ బాధ్యతలు అప్పగించగా.. ఆ రెండు రాష్ట్రాలకు సిద్ధార్థ్ శంభు కో-ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. తెలంగాణతో పాటు పశ్చిమ బెంగాల్ పార్టీ వ్యవహారాల బాధ్యతలను సునీల్ బన్సల్‌కు అప్పగించారు. తెలంగాణకు అభయ్ పాటిల్, రేఖా శర్మ కో-ఇన్‌ఛార్జ్‌లుగా నియమితులయ్యారు. బెంగాల్‌కు లాల్ సింగ్ ఆర్య, రాజేంద్ర సింగ్, పింకీ కుష్వాహా కో-ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరించనున్నారు. దేశంలో కీలకంగా భావించే ఉత్తర్‌ప్రదేశ్ పార్టీ వ్యవహారాలను జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే పర్యవేక్షించనున్నారు. జగదీశ్ పటేల్, మేధా కులకర్ణి, ప్రదీప్ శర్మ, అనంత్ ఓజా సహకార బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా బీజేపీ ఉపాధ్యక్షుడు బైజయంత్ జయ్ పాండా నియమితులవ్వగా.. అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తానవాడే, కమల్‌జీత్ సెహ్రావత్ కో-ఇన్‌ఛార్జ్‌లుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఢిల్లీ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా సీనియర్ నేత వినయ్ సహస్ర బుద్ధేను నియమించారు. జమ్యాంగ్ త్సెరింగ్ నంగ్యాల్, దర్శనా జర్దోష్ కో-ఇన్‌ఛార్జ్‌లుగా ఉంటారు.



## స్టార్లు.. వెలుగును పంచేలా ఉండాలి

**సమయం ప్రతినిధి:** సినీ నటులు తమకున్న ప్రజాదరణను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే ఉత్పత్తులను ప్రచారం చేసే ముందు వారు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని సూచించారామె. అయితే.. ముర్ము వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో చర్చలు జోరందుకున్నాయి. హానికరమన్న ప్రొడక్ట్స్‌ను ప్రచారం చేయొద్దని చెబుతున్నప్పుడు.. వాటి తయారీ, విక్రయాలపై ప్రభుత్వాలు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. కాగా.. నిన్న(మంగళవారం) 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల కార్యక్రమంలో భాగంగా.. రాష్ట్రపతి ముర్ము సినీ ప్రముఖులను ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్యంగా యువత, పిల్లలపై సినీ తారలు చూపే ప్రభావాన్ని ప్రస్తావించారు. ప్రముఖుల మాటలు, చేతలు కోట్లాది మంది ప్రజల నిర్ణయాలను ప్రభావితం చేస్తాయన్న ఆమె.. వాటిని సమాజహితానికి మాత్రమే ఉపయోగించాలని సూచించారు. 'రియల్ స్టార్స్ వెలుగును పంచాలి.. చీకటిని కాదు' అన్న ఆమె వ్యాఖ్యలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆరోగ్యానికి హాని కలిగించే ఉత్పత్తులకు ప్రచారకర్తలుగా వ్యవహరించడానికి ముందు వారు సామాజిక బాధ్యతను గుర్తుంచుకోవాలని ఆమె పరోక్షంగా సూచించారు. అయితే.. రాష్ట్రపతి వ్యాఖ్యలకు పలువురు మద్దతు తెలుపగా.. మరి కొందరు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నలు లేవనెత్తారు.




## ఆ వార్తలు అవాస్తవం

**సమయం ప్రతినిధి:** కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ)లో విభేదాలు తలెత్తాయన్న వార్తలు దుమారం రేపుతున్న నేపథ్యంలో.. ఎన్నికల సంఘం వర్గాలు స్పందించాయి. ఆ ఆరోపణల్ని ఖండిస్తూ.. ఎన్నికల కమిషనర్ల మధ్య ఎలాంటి అధికారిక విభేదాలూ లేవని తెలిపాయి. కమిషనర్లు చేసిన కొన్ని పరిశీలనలను మాత్రమే అధికారులు పరిశీలించారని పేర్కొన్నాయి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ సహా ఈసీలు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభిప్రాయాలతోనే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నట్టు వెల్లడించాయి. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ(సర్) సహా అన్ని నిర్ణయాలూ ముగ్గురు కమిషనర్ల ఆమోదంతో, ఏకాభిప్రాయంతోనే జరిగాయని స్పష్టం చేశాయి. ఈ కమిషన్‌లో ఏదైనా అంశంపై ఇద్దరు సభ్యులు ఏకాభిప్రాయానికి వస్తే మెజారిటీ నిర్ణయం అమలయ్యే నిబంధన ఉన్నప్పటికీ.. 'సర్' సహా కీలక నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. కాగా.. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి.. 10 నెలల్లో కనీసం 14 సార్లు కొన్ని నిర్ణయాలపై అభ్యంతరం వ్యక్తం చేసినట్టు ఓ ఆంగ్ల మీడియా కథనం పేర్కొంది. ముఖ్యంగా ఓటర్ల జాబితా, ఫారమ్-6లో మార్పులు, ఓటర్ల సమాచారాన్ని కేంద్రీకృతం చేయడం వంటి అంశాలపై వారు ప్రశ్నలు లేవనెత్తినట్లు తెలిపింది. ఓటర్ల నమోదు నిబంధన-1960లో సవరణలు చేయకుండా చట్టబద్ధమైన ఫారమ్‌లో మార్పులు చేయడం చట్టవిరుద్ధం, అనధికారికమని వారు పేర్కొన్నట్లు వెల్లడించింది.




## దసరాకు 'చేయూత'

**ప్రభుత్వం చేయూత పింఛన్ల పంపిణీకి ముహూర్తం ఖరారు చేసింది. దసరా పండుగలోగా అర్హులకు ఆర్థిక భరోసా అందించాలని నిర్ణయించింది. సామాజిక భద్రతా పింఛన్లను కొత్తవారికి అక్టోబరు నుంచి పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ పథకం కింద జిల్లాలో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులు, తదితరులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసే పనిలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. జిల్లాలో మొత్తం 27 మండలాలు, ఆరు మునిసిపాలిటీలు, 526 గ్రామ పంచాయతీలు ఉండగా కొత్త పింఛన్ల కోసం మొత్తం 37,831 దరఖాస్తులు వచ్చాయి.**

**సమయం ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లాలో కొంత భాగం జీహెచ్ఎంసీ పరిధిలో ఉండగా ప్రస్తుతం చేయూత పింఛన్ల కింద 1,90,950 మంది లబ్ధిదారులకు నెలవారీగా రూ.43.72 కోట్లు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో ఎంత మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేస్తారన్నది ఉన్నతాధి, కారులు వెల్లడించనున్నారు. అయితే జిల్లాయంత్రాంగం మాత్రం కొత్త పింఛన్లపై వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టింది. దరఖాస్తుల పరిశీలనను ఈ నెలాఖరు వరకు కొనసాగించనున్నారు. ఈ నెలలోనే పరిశీలన పూర్తి చేసి కొత్త పింఛన్లు అందించాలని భావించినప్పటికీ, సర్టిఫికెట్ల జారీ, క్షేత్రస్థాయి ధ్రువీకరణలో ఏర్పడిన సమస్యలతో జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. వచ్చేనెల మొదటి వారంలో లబ్ధిదారులను ఖరారు చేసి, దసరా నుంచి కొత్త పింఛన్లు పంపణీ చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే ఆగస్టు 9 నుంచి సెర్ప్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. తర్వాత సెప్టెంబరు 15వరకు గడువు పొడగించారు.

**క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులు :** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం 2.5లక్షల వరకు కొత్త పింఛన్లకు అనుమతించింది. అర్హతలు, ఆదాయ పరిమితులు, కుటుంబ పరిస్థితులు, కేటగిరీకి చెందిన ఆధారాలను అధికారులు పరిశీలించిన తర్వాతనే తుది జాబితా సిద్ధం చే యనున్నారు. కొత్త పింఛన్లలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి. వీటిలో ఒంటరి మహిళల అర్హతను నిర్ధారించేందుకు అవసరమైన పత్రాలు ప్రధాన సమస్యగా మారాయి. వివాహం జరిగి విడిపోయిన మహిళలకు విడాకుల పత్రం లేనిపక్షంలో కోర్టు ఉత్తర్వులతో పాటు ఏడాదిగా ఒంటరిగా ఉన్నట్టుగా ధ్రువీకరణ అవసరం.

## నిమజ్జనానికి తరలివస్తున్న వినాయక విగ్రహాలు..



**హైదరాబాద్, సెప్టెంబర్ 23, సమయం ప్రతినిధి :** నగరంలోని ట్యాంక్‌బండ్ పరిసరాల్లో వినాయక నిమజ్జనాల సందడి కొనసాగుతోంది. నవరాత్రులు పూర్తవడంతో నిమజ్జనానికి వినాయక విగ్రహాలు తరలివస్తున్నాయి. గణనాథుని నామస్మరణతో ట్యాంక్‌బండ్ పరిసరాలు మారుమోగుతున్నాయి. వినాయక విగ్రహాల నిమజ్జనాల నేపథ్యంలో ట్యాంక్‌బండ్ చుట్టూ భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వెంటనే అలర్ట్ అయిన పోలీసులు.. రద్దీకి అనుగుణంగా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. నిమజ్జన మార్గాల్లో ప్రత్యేక బారికేడ్లు, ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్ పరిసరాల్లో పోలీసులు నిరంతరాయంగా పర్యవేక్షణ చేస్తున్నారు. నిమజ్జనానికి వచ్చే వాహనదారులు.. పోలీసులకు సహకరించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు పోలీసు, ఇతర విభాగాల సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు.



## ఉద్యోగులకు గుడ్ న్యూస్.. రెండు డీఏలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకారం

**సమయం ప్రతినిధి :** తెలంగాణ ప్రభుత్వంతో ఉద్యోగ సంఘాలు జరిపిన చర్చలు ముగిశాయి. రెండు డీఏలు ఇచ్చేందుకు సర్కార్ అంగీకరించింది. అలాగే నాలుగు నెలల తర్వాత మరో డీఏ ఇచ్చేందుకు ఓకే చెప్పింది. అంతేకాకుండా, ఈ నెలలోనే పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చింది. పీఆర్సీ కమిషన్ గడువును పొడిగించకుండా నివేదిక అందేలా చూడాలని ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. గడువులోపే పీఆర్సీ ప్రకటించాలని కోరాయి. డీఏ, పీఆర్సీ విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు పాల్గొన్నారు.

**ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది: లచ్చిరెడ్డి**

సమావేశం అనంతరం సచివాలయం మీడియా పాయింట్ వద్ద తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ... సీఎస్ ఆధ్వర్యంలో జాయింట్ స్టాఫ్ కమిటీ మీటింగ్ జరిగిందని తెలిపారు. ఉద్యోగుల నుంచి వస్తున్న ప్రధాన డిమాండ్లతో ఈనెల 6న ఉద్యోగ సంకల్ప సభ నిర్వహించామని తెలిపారు. మొత్తం 68 డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం సానుకులంగా స్పందించిందని.. అన్ని సమస్యల పరిష్కారానికి మార్గం చూపించినట్లు తెలిపారు. తమ డిమాండ్ల విషయంలో చొరవ తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ సంజయ్ జాజుకు ధన్యవాదాలు తెలియజేశారు. మొదటి డీఏ 3.64, రెండో డీఏ 2.74 కు ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. కమిటీ నివేదిక రాగానే పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారని లచ్చిరెడ్డి పేర్కొన్నారు.



## సీఎం రేవంత్ ఫోన్.. డీకే గ్రీన్ సిగ్నల్

**సమయం ప్రతినిధి :** తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదలకు కర్ణాటక సర్కార్ అంగీకారం తెలిపింది. అల్మట్టి నుంచి మూడు టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక సీఎం డీకే శివకుమార్ సానుకూలంగా స్పందించారు. అంతర్‌రాష్ట్ర జలాల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ బృందం.. కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో సమావేశం అయ్యారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు జి. మధుసూదన్ రెడ్డి, మేఘరెడ్డి ఉన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఆల్మట్టి నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని ఇప్పటికే మంత్రులు వినతిపత్రం సమర్పించిన విషయం తెలిసిందే. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నీటి ఎద్దడి, పంటల ప్రస్తుత పరిస్థితులు వంటి అంశాలను డీకే శివకుమార్‌కు మంత్రులు వివరించారు. మానవతా దృక్పథంతో పాలమూరు ప్రజలకు సాగు, తాగునీటిని విడుదల చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు కోరారు. మంత్రుల విజ్ఞప్తికి కర్ణాటక సీఎం అంగీకరించారు. నీటి విడుదలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆ రాష్ట్ర అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. నీటి విడుదలలో ఆలస్యం చేయకుండా వెంటనే చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి నిన్న తనకు ఫోన్ చేశారని తెలంగాణ ప్రజాప్రతినిధులకు డీకే శివకుమార్ వెల్లడించారు. తాను అసెంబ్లీలో ఉండటంతో రేవంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడలేకపోయానని డీకే వివరించారు. తిరిగి కాల్ చేసి చాలాసేపు మాట్లాడుకున్నామని చెప్పుకొచ్చారు. రెండు రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే రైతుల అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు వెళ్లవచ్చని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా తెలంగాణకు నీటిని విడుదల చేస్తామని కర్ణాటక ఇరిగేషన్ అధికారులు చెప్పారు. కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంపై తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు.



## కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది..

**సమయం ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది.. రాష్ట్రంలో కరెంట్ పోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే కరెంట్ ఉండదని తాము ముందే చెప్పామని ఆయన గుర్తు చేశారు. తాము అప్పుడు చెప్పిందే ప్రస్తుతం జరుగుతోందని అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజులో కనీసం 6 గంటలు కూడా విద్యుత్ సరఫరా ఉండట్లేదని పేర్కొన్నారు. ఇది ఎల్‌నినో ఎఫెక్ట్ కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రభావమని వ్యంగ్యంగా అన్నారు. థర్మల్ పవర్ స్టేషన్లకు బొగ్గు కూడా ఇవ్వలేక పోతున్నారంటూ రేవంత్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో 1980లో ఫొటో ట్రెండ్ నడుస్తుంటే.. తెలంగాణలో మాత్రం 1980 నాటి పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో విద్యుత్ సమస్యపై అధిక దృష్టి పెట్టామని గుర్తు చేశారు. వ్యవసాయం, పరిశ్రమలకు 24 గంటల విద్యుత్ ఇచ్చామని వివరించారు. విద్యుత్ అంశంపైనే తమ మలి దశ ఉద్యమం నడిచిందని చెప్పారు. అద్భుతమైన విద్యుత్ వ్యవస్థను బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రూపొందించారని ఈ సందర్భంగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు.

# సంపాదకీయం

## రాహులే మోదీ విజయ రహస్యం!

పావు శతాబ్ది క్రితం నాటి మాట. 2001 అక్టోబర్ 1న న్యూఢిల్లీలో ఉన్న నరేంద్రమోదీ ఫోన్ మోగింది. 'ఎక్కడున్నారు?' అని అడిగిన ప్రశ్న విని మోదీ చకితులయ్యారు. ఎందుకంటే ఆ స్వరం ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయిది. 'శ్మశానంలో ఉన్నాను' అని మోదీ జవాబిచ్చారు. వాజపేయి దిగ్భ్రాంతి చెందారు. 'అక్కడేం చేస్తున్నారు?' అని అడిగారు. 'నిన్న విమాన ప్రమాదంలో మరణించిన కాంగ్రెస్ నేత మాధవరావు సింధియాతో పాటు నా మిత్రుడు, ఫొటో జర్నలిస్టు గోపాల్ భిస్త్ కూడా మరణించాడు. అతడి అంత్యక్రియలకు వచ్చాను' అని మోదీ చెప్పారు. 'సరే, సాయంత్రం రండి..' అని వాజపేయి ఫోన్ పెట్టేశారు. సాయంత్రం తనను కలిసిన మోదీని చూడగానే వాజపేయి నవ్వుతూ 'ఢిల్లీలో పంజాబీ తిండి బాగా ఒంటబట్టినట్లుంది. మీకిక్కడ ఏమీ పనిలేదు. గుజరాత్‌కు వెళ్లి అక్కడ పనిచేసుకోండి' అని చెప్పారు. వాజపేయి ఏమంటున్నారో మోదీకి మొదట అర్థం కాలేదు. అప్పటికే ఆయన ఆరేళ్లుగా ఢిల్లీలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా వివిధ రాష్ట్రాల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 'గుజరాత్‌లో ఏమి చేయాల్సి ఉంటుంది సార్' అని వాజపేయిని మోదీ అడిగారు. 'ఏం చేస్తారు? ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాలి' అని అటల్జీ అన్నారు. మోదీ ఉబ్బితబ్బిబ్బయ్యారు. తనకు అంత పెద్ద బాధ్యత అప్పగిస్తారని ఆయన ఊహించలేదు. 'నేను ఇంతవరకూ అసెంబ్లీ ముఖమే చూడలేదు. ముఖ్యమంత్రి కార్యాలయంలోకి అడుగు పెట్టలేదు. ఆరేళ్లుగా అక్కడేం జరుగుతున్నదో నాకు తెలియదు' అని మోదీ అన్నారు. 'నేను కూడా మొదటిసారి ఢిల్లీ వచ్చినప్పుడు నాకిక్కడ ఎవరూ తెలియదు' అని వాజపేయి చమత్కరించారు. మోదీ వెన్వెంటనే తనకు మార్గదర్శకుడైన లాల్‌కృష్ణ ఆడ్వాణీ ఇంటికి వెళ్లారు. 'అటల్జీ అంతా చెప్పారు కదా?' అని ఆయన అనేసరికి మోదీ ఆశ్చర్యపోయారు. తనను గుజరాత్ పంపాలన్న ఆలోచన వాజపేయి ఒక్కరిదే కాదని ఆయనకు అర్థమైంది. అప్పటి ఆరెస్సెస్, సర్ సంఘ్ చాలక్ సుదర్శన్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి మదన్‌దాస్ దేవి, సీనియర్ నేత దత్తోపంత్ ఠేంగ్డీలతో చర్చించిన తర్వాతే తాను, వాజపేయి కలిసి నిర్ణయం తీసుకున్నామని మోదీకి ఆడ్వాణీ చెప్పారు. ఆ తరువాత అశోకా రోడ్‌లోని బీజేపీ కార్యాలయానికి మోదీ వెళ్లారు. అక్కడ విలేఖర్లతో మాట్లాడుతూ 'నేను మళ్లీ గుజరాత్‌లో అడుగుపెడుతున్నాను' అని మందహాసంతో చెప్పారు. పత్రికా గోష్ఠిని ముగిస్తూ ప్రతి ఒక్కరితో కరచాలనం చేశారు. అప్పట్లో ఆయనకు విలేఖర్లతో మంచి సంబంధాలు ఉండేవి. విలేఖర్ల సమావేశంలో మాట్లాడేందుకు ఇతర నేతలతో పోటీపడేవారు. ఆ తర్వాత అంత హాయిగా ఆయన మాట్లాడడాన్ని నేనెప్పుడూ చూడలేదు. మోదీని ముఖ్యమంత్రిగా గుజరాత్ పంపాలని బీజేపీ అగ్రనేతలు నిర్ణయం తీసుకోవడానికి ముఖ్య కారణాలున్నాయి. గుజరాత్‌లో పార్టీ అగ్రనేతలు కేశుభాయి పటేల్, శంకర్‌సింగ్ వాఘేలాల మధ్య అంతర్గత చిచ్చు నేపథ్యంలో మోదీ 1995లో ఢిల్లీ రావాల్సి వచ్చింది. 1998 ఫిబ్రవరిలో జరిగిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో గుజరాత్‌లో పార్టీని గెలిపించేందుకు ఆయన విశేష కృషి చేశారు. మోదీ ప్రాధాన్యాన్ని గుర్తించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు కుశాభావు ఠాక్రే ఆయనను గోవిందాచార్య, వెంకయ్యనాయుడు, సుమిత్రా మహాజన్‌లతో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. 2000లో బంగారు లక్ష్మణ్ అధ్యక్షుడైన తర్వాత కూడా మోదీని తన టీమ్‌లో కొనసాగించారు. ఈ మధ్య కాలంలో గుజరాత్‌లో పార్టీ పరిస్థితి బాగా బలహీనపడింది. పటిష్ఠ పాలననందించడంలో కేశుభాయి పటేల్ వైఫల్యం, తీవ్ర కరువు తాండవించడం, భుజ్‌లో భయానక భూకంపం సంభవించినప్పుడు ప్రభుత్వం సరైన సహాయక చర్యలు చేపట్టలేకపోవడంతో బీజేపీ ప్రతిష్ఠ తీవ్రంగా దిగజారింది. స్థానిక ఎన్నికల్లో పార్టీ ఘోరంగా దెబ్బతింది. మొత్తం 25 జిల్లా పంచాయతీల్లో 23 పంచాయతీలను బీజేపీ కోల్పోయింది. పట్టణ ప్రాంతాల్లో కూడా బీజేపీ పట్టు కోల్పోసాగింది. 2001 సెప్టెంబర్‌లో ఆడ్వాణీ ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని సబర్మతితో సహా రెండు స్థానాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో పార్టీ ఘోరంగా ఓడిపోయింది. గుజరాత్‌లో నాయకత్వ మార్పు జరగాల్సిందేనని పార్టీ పరిశీలకులు మదన్ లాల్ ఖురానా, కుశాభావు ఠాక్రే నివేదిక సమర్పించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే వాజపేయి, ఆడ్వాణీల నిర్ణయం మేరకు 2001 అక్టోబర్ 7న మోదీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నరేంద్రమోదీ సుదీర్ఘకాలం ముఖ్యమంత్రి పదవిలో కొనసాగడమే కాకుండా ప్రధానమంత్రి అవుతారని, అధికారంలో పాతికేళ్ల ప్రస్థానం పూర్తి చేస్తారని వాజపేయి, ఆడ్వాణీలు ఆ రోజు బహుశా ఊహించి ఉండకపోవచ్చు. ఒక పదవిని సాధించడమే కాక, ఆ పదవిలో స్థిరపడి తిరుగులేని నాయకుడుగా ఎదగగలగడం వెనుక మోదీ విజయ రహస్యం ఏమిటి? మోదీ ముఖ్యమంత్రి అయిన వెంటనే తొలుత చేసిన పని పార్టీలో అంతర్గత కుమ్ములాటలను ఉక్కుపిడికిలితో అణచివేయడం తనకు వ్యతిరేకంగా ఉన్న సంజయ్ జోషిని గుజరాత్ నుంచే కాక పార్టీ నుంచి కూడా బయటకు పంపించడంలో మోదీ కృతకృత్యులు కాగలిగారు. సామ, దాన, భేద దండోపాయాలతో తనకు ఎదురు లేకుండా చేసుకుంటేనే మనుగడ సాధించగలమని ఆయన గ్రహించడమే అందుకు కారణం. చిన్నప్పుడు శాఖలో ఒక వ్యక్తి ఆదేశాలివ్వడం, అందరూ వాటిని క్రమశిక్షణతో పాటించడం మోదీ మనసుపై ప్రగాఢ ప్రభావం చూపింది. సంఘ్ పరివార్ వ్యవహారశైలే ఆయన డీఎన్ఏగా మారింది. నాయకుడన్న వ్యక్తి ఏది చెబితే అదే జరగాలని, రెండో అభిప్రాయానికి ఆస్కారం లేదని ఆయన పూర్తిగా విశ్వసించారు. తన చుట్టూ ఉన్నవారు తననే గమనించేలా, తన మాటే వినేలా చేయడం ఆయన తత్వంలో జీర్ణించుకుపోయిందని ఆయనపై రచనలు చేసిన అనేకమంది రచయితలు అభిప్రాయపడ్డారు. నరేంద్రమోదీ తన ప్రత్యర్థులను ఎప్పుడూ సహించరని, గుజరాత్‌లో ఆయన మంత్రివర్గంలో హోంశాఖ సహాయమంత్రిగా ఉన్న గోవర్ధన్ జడాఫియా వ్యాఖ్యానించారు. జడాఫియా మాత్రమే కాదు, మోదీకి గురువుగా ప్రసిద్ధుడైన కేశుభాయి పటేల్ కూడా తన శిష్యునికి వ్యతిరేకంగా వేర్వేరు పార్టీలు స్థాపించి తెరమరుగయ్యారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తాను అనుసరించిన వైఖరినే ప్రధానమంత్రి అయ్యాక కూడా మోదీ అనుసరించారు. గుజరాత్ అల్లర్ల సమయంలో తనకు అండగా నిలిచి తన పదవి పోకుండా కాపాడి, మొత్తం పార్టీ మద్దతునిచ్చేలా చేసిన లాల్‌కృష్ణ ఆడ్వాణీ, తనను ఏకతా యాత్రలో వెంట తీసుకువెళ్లిన మురళీ మనోహర్ జోషిని ఆయన మార్గదర్శక మండలికి పంపించారు. అయితేనేం, మోదీ ప్రధాని అయినప్పటి నుంచీ గత పన్నెండు సంవత్సరాలుగా బీజేపీలో ఎలాంటి లుకలుకలు లేవు. మంత్రులు గానీ, పార్టీ సభ్యులు గానీ నాయకత్వానికి వ్యతిరేకంగా కిక్కురుమన్న సందర్భాలు లేవు. ఎవరిని కేంద్రమంత్రిగా నియమించినా ముఖ్యమంత్రిగా నియమించినా, చివరకు పార్టీ జాతీయ అధ్యక్షుడుగా ఎవరిని నియమించినా అడిగేవారు లేరు. ఒక పరిపాలకుడిగా బ్యూరోక్రాట్లతో చర్చించినట్లు మోదీ కనపడినా రాజకీయ కీకారణ్యంలో ఆయనే రారాజు. మోదీ చెప్పిందే వేదం. పార్టీ నేతలే కాదు, ఎన్డీఏలో ఒకప్పుడు మోదీని వ్యతిరేకించిన నేతలందరూ ఇవాళ ఆయన పుట్టిన రోజు వేడుకలు జరుపుతున్నారు. ఈ సందర్భంగా పోటీపడి మోదీని పొగడడం, దీపాలు వెలిగించడం చేస్తున్నారంటే రాజకీయాలపై ఆయన పట్టు బిగించిన తీరును అభినందించాల్సిందే. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని సైతం ఉపేక్షించిన నేతలు మోదీ జన్మదినాన్ని జరుపుకుంటున్నారంటే అది ఆయన నాయకత్వ విశిష్టత అని చెప్పక తప్పదు. ఇదివరకు నియంతృత్వ పాలకుల ఆధిపత్యానికి, నిఘాకు సంకేతంగా 'బిగ్ బ్రదర్ ఈజ్ వాచింగ్' అని హెచ్చరించేవారు. ఇప్పుడదే వ్యాఖ్య మోదీ విషయంలో వర్తిస్తుందని బీజేపీ, ఎన్డీఏ నాయకులందరికీ తెలుసు. ఎవరు దీపాలు వెలిగిస్తున్నారో, ఎవరు చప్పట్లు కొడుతున్నారో, ఎవరు తనను ఆకాశానికెత్తుతున్నారో మోదీకి తెలియకుండా ఉంటుందా? ఏమైతేనేం అధికారంలో పాతికేళ్లు పూర్తిచేసుకున్న పలువురు ప్రపంచ నేతల సరసన మోదీ కూడా చేరారు. తననే అందరూ గమనించేలా, తన గురించే అందరూ మాట్లాడేలా చేసుకోవడం. తనను విమర్శించినా, దూషించినా, తనను అవహేళన చేసినా తానే చర్చలో ప్రధాన కేంద్రం అయ్యేలా చూసుకోవడం మోదీ స్వభావం. ఇది ఆయన విజయ రహస్యంలో మరో కీలకాంశం. గుజరాత్ రోజుల నుంచీ ఆయన ఇదే శైలిని అవలంబిస్తున్నారు. వేషాలు మార్చినా, నాటకీయంగా వ్యవహరించినా, నవ్వినా, విదేశీ నేతలను హత్తుకున్నా అందరి దృష్టీ తనపై పడేలా ఉద్దేశపూర్వకంగా చేయడమే మోదీ లక్ష్యం. దానివల్ల తన అభిమానులు, భక్తుల సంఖ్య ఏ మాత్రం తగ్గదని, పైగా తననెవరైనా విమర్శిస్తే వారు రెట్టింపు ఆగ్రహంతో దాడి చేస్తారని మోదీకి తెలుసు.

## ఫామ్‌హౌస్‌ల పేరుతో అక్రమాలకు పాల్పడ్డారు

**కేసీఆర్ కుటుంబంపై 10 ఏళ్లు రాష్ట్రాన్ని దోసుకున్నది టిఆర్ఎస్ పార్టీ మంత్రులు ఎమ్మెల్యేలు**
**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీవ్ర ఆరోపణలు**

షాద్‌నగర్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని భారీగా అవినీతికి పాల్పడ్డారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. షాద్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం ఇటీవల కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తదితరులకు సంబంధించినవిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫామ్‌హౌస్ ప్రాంతాలను పరిశీలించిందన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని భూముల విషయంలో అక్రమాలకు పాల్పడ్డారని, నిబంధనలను ఉల్లంఘించి ఫామ్‌హౌస్‌లు నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయని ఎమ్మెల్యే శంకర్ పేర్కొన్నారు. ముఖ్యంగా అజీజ్‌నగర్‌లో హరీశ్‌రావుకు సంబంధించినదిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫామ్‌హౌస్ ప్రాంతాన్ని పరిశీలిస్తే గత ప్రభుత్వ హయాంలో జరిగిన వ్యవహారాలపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. 111 జీవో, ఎఫ్‌టీఎల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగాయనే ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ప్రజల ఆస్తులు, ప్రభుత్వ భూముల విషయంలో అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం చేపట్టిన ఫీల్డ్




విజిట్ ద్వారా ఫామ్‌హౌస్‌లకు సంబంధించిన భూములు, నిర్మాణాలు, అనుమతుల అంశాలను ప్రజలకు తెలియజేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం చేపడుతున్న విచారణల ద్వారా వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉందన్నారు.

## జూరాల నీటి విడుదలకు కృషి చేసిన మంత్రులకు రైతుల ఘన స్వాగతం

కర్ణాటక ముఖ్యమంత్రితో మాట్లాడి ఎగువ నుండి జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదల జరిగేలా కృషి చేసిన రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే లు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డి లకు రైతులు ఘన స్వాగతం పలికారు. శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న మంత్రులను రైతులు పూల బొకేలు అందజేసి, శాలువాలు కప్పి సత్కరించారు. జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదల కోసం రైతుల తరపున మంత్రులు చేసిన చొరవకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న ఆయకట్టు రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. రైతుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని వెంటనే స్పందించిన మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





## కీసరలో అక్రమ షెడ్ల నిర్మాణాల జోరు

**టౌన్‌ప్లానింగ్ పర్యవేక్షణపై అనుమానాలు.. మున్సిపల్ ఆదాయానికి భారీ గండి**
**నోటీసుల పేరుతో నాలుగు నెలలుగా కాలయాపన.. చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్.**

వేకువ సమయం సెప్టెంబర్ 23 కీసర ప్రతినిధి : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కీసర పరిధిలో అక్రమ షెడ్ల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. నిర్మాణాలకు అవసరమైన అనుమతులు లేకపోయినా పనులు సాగుతున్నాయని, సంబంధిత టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాల్సి ఉన్నప్పటికీ సకాలంలో చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**అనుమతులు లేకుండానే నిర్మాణాలు**

కీసరలో పలు ప్రాంతాల్లో షెడ్ల నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. భవన నిర్మాణాలకు ముందస్తు అనుమతులు, సంబంధిత ప్లాన్ ఆమోదం, ఇతర మున్సిపల్ నిబంధనలు పాటించాల్సి ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా నిర్మాణాలు సాగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత అధికారులు స్పందిస్తే ప్రభుత్వ నిబంధనల ఉద్దేశమే దెబ్బతింటుందని స్థానికులు అంటున్నారు.

**మున్సిపల్ ఆదాయానికి గండి**

అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టడం వల్ల మున్సిపాలిటీకి రావాల్సిన ఫీజులు, పన్నులు తదితర రూపాల్లో ఆదాయం కోల్పోయే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే గుర్తించి నిలిపివేస్తే ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరగకుండా చూడవచ్చని వారు చెబుతున్నారు. నిర్మాణాలు పూర్తయ్యే వరకు అధికారులు స్పందించకపోవడం వల్ల అక్రమ నిర్మాణదారులకు మరింత ప్రోత్సాహం లభిస్తోందని విమర్శిస్తున్నారు.

**సిబ్బందిపై తీవ్ర ఆరోపణలు**

అక్రమ నిర్మాణదారుల నుంచి కొందరు చైన్‌మెన్లు, సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది. ఇలాంటి ఆరోపణలు నిజమైతే సంబంధిత వ్యవహారాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**నోటీసుల పేరుతో కాలయాపన?**

అక్రమ షెడ్ల నిర్మాణాలపై టీపీఓ మేఘనను సంప్రదించిన సందర్భాల్లో నోటీసులు జారీ చేస్తామని చెప్పినప్పటికీ, గత నాలుగు నెలలుగా ఇదే సమాధానం వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నోటీసులు ఇవ్వడం మాత్రమే కాకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను గుర్తించి తదుపరి చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు దృష్టి సారించాలి**

కీసరలో జరుగుతున్న నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ విభాగం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు, నిర్మాణ నిబంధనలు, భవన వినియోగం తదితర అంశాలను పరిశీలించి అక్రమంగా ఉన్న నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే అధికారులపై వస్తున్న ఆరోపణలపైనా ఉన్నతస్థాయి విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి, మున్సిపల్ ఆదాయాన్ని పరిరక్షించడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాలని కీసర వాసులు కోరుతున్నారు.

## ఎన్నికల సంఘంపై ప్రియాంక, రాహుల్, ఖర్గే ఘాటు వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ, సెప్టెంబర్ 23: ఎన్నికల నిష్పాక్షికతపై రాజకీయ రచ్చ పీక్ స్టేజ్‌కి చేరింది. తాజాగా ఓ ప్రముఖ ఆంగ్ల దిన పత్రిక ప్రచురించిన కథనం ఆధారంగా కాంగ్రెస్ అగ్రనేతలు ఎన్నికల సంఘం మీద తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ECI పనితీరుపై మండిపడుతున్నారు. కేరళలోని మలప్పురం జిల్లా నిలంబూరులో మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. ఎన్నికలు పారదర్శకంగా జరగకపోతే ప్రజా స్వామ్యానికి అర్థమే లేదని, ఎన్నికల్లో అక్రమాలు జరగడానికి ఎన్నికల సంఘం సహకరిస్తే అది ప్రజాస్వామ్యంపై జరిగే తీవ్రమైన దాడి అని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్లకు ఈ అక్రమాల గురించి తెలిసి కూడా అనుమతిస్తుంటే, అది తీవ్రమైన 'దేశద్రోహ చర్య' క్రిందికే వస్తుందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఓటు చోరీ అనేది భారత ప్రజలకు, రాజ్యాంగానికి వ్యతి రేకంగా జరిగే నేరమని కాంగ్రెస్ అధ్యక్షులు ఖర్గే అన్నారు. ఈ ప్రక్రియలో భాగస్వాములవుతున్న అధికారులు రాజ్యాంగ వ్యతిరేక పనులకు దూరంగా ఉండాలని, భవిష్యత్తులో బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

## అవినీతి, అన్యాయానికి పాలనలో చోటుండకూడదు
## ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందాలి: పొన్నాల గౌరీశంకర్

వేకువ సమయం సెప్టెంబర్ 23 కీసర ప్రతినిధి : ప్రజాసేవలో అవినీతి, అక్రమాలు, అన్యాయాలకు తావులేకుండా పాలనా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీనియర్ జర్నలిస్టు, ఆధ్యాత్మికవేత్త, పర్యావరణ పరిరక్షణవేత్త పొన్నాల గౌరీశంకర్ అన్నారు. అధికారులు అహంకార ధోరణికి దూరంగా ఉండి ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలకు తావులేకుండా ప్రజల పనులు నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. దరఖాస్తులను అనవసర కారణాలతో తిరస్కరించడం, చిన్నచిన్న పనుల కోసం ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం వంటి విధానాలకు స్వస్తి పలకాలని అన్నారు. ముఖ్యంగా తహశీల్దార్ కార్యాలయాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, భూ వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడే అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారసత్వ భూముల హక్కులను పరిరక్షించడంతో పాటు భూకబ్జాలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి



బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు ఎలాంటి లంచాలు, అక్రమాలకు తావులేకుండా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు హక్కుగా అందాల్సిన ప్రభుత్వ సేవల కోసం లంచం చెల్లించాల్సిన పరిస్థితి లేకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత అని పొన్నాల గౌరీశంకర్ స్పష్టం చేశారు.

## వ్యక్తి పూజతో పాతాళంలోకే..!

సమయం ప్రతినిధి : ప్రజలు తమకు నచ్చిన హీరో, హీరోయిన్లను అభిమానించడం, మొదటి ఆట సినిమా కోసం ఎగబడి ప్రాణాలు కూడా కోల్పోవడం వివిధ సందర్భాలలో చూశాం. అది ఒక రకమైన వ్యక్తి పూజ. రాజకీయాలలో కూడా నాయకులను దేవుళ్లుగా చూడడం, ఇంకా పిచ్చి ముదిరి గుడులు కట్టించిన వార్తలు కూడా వచ్చాయి. సినీ నటులను పూజిస్తే అది వారి వ్యక్తిగతం. కానీ, రాజకీయ నాయకుల విషయం వేరు. వీరు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా దేశ భవిష్యత్తుపై పెద్ద ప్రభావమే కలిగిస్తారు. వ్యక్తి పూజ ఎక్కువైతే, అది క్రమంగా నిరంకుశత్వంగా మారి, దేశాన్ని అంధకారంలోకి నెట్టేయడమే కాక, అంతిమంగా ఆ నాయకుణ్ణి కూడా పాతాళంలోకి నెట్టేస్తుంది. అందుకు హిట్లర్, ముస్సోలినీ వంటి నాయకులే ఉదాహరణ. మన దేశంలో 'ఇండియాయే ఇందిర–ఇందిరే ఇండియా' వంటి వ్యక్తి పూజ చివరకు ఎమర్జెన్సీకి దారితీసి, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసింది. అవి దేశంలో చీకటి రోజులుగా నిలిచాయి. అంతిమంగా అది వారి పార్టీకీ నష్టం కలుగజేసి, అర్ధ శతాబ్దం అయినా నేటికీ వారిని వెంటాడుతూనే ఉంది. నేడు మరలా అలాంటి లేదా అంతకంటే ప్రమాదకరమైన పరిస్థితులు దేశంలో ఏర్పడుతున్నాయి. ఈ సందర్భంగా ఈ వ్యక్తి పూజ ప్రమాదాన్ని గురించి ఆధునిక భారత నిర్మాతలు ఏమన్నారో గుర్తు చేసుకోవడం సందర్భోచితం. గణతంత్ర ఆవిర్భావ సమయాన బి.ఆర్.అంబేడ్కర్ 1949 నవంబర్ 25న రాజ్యాంగ సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, భారత రాజకీయ ఆలోచనలో అత్యంత లోతైన హెచ్చరికలలో ఒకదాన్ని చేశారు: 'మతంలో భక్తి ఆత్మ మోక్షానికి మార్గం కావచ్చు. కానీ రాజకీయాల్లో భక్తి లేదా వ్యక్తి పూజ కచ్చితంగా పతనానికి, ఆ తర్వాత నిరంకుశత్వానికి దారితీసే మార్గం.' మన ఆధ్యాత్మిక సంప్రదాయాలలో భక్తికి పవిత్రమైన స్థానం ఉంది. కానీ రాజకీయం వేరని అంబేడ్కర్ స్పష్టం చేశారు. సంప్రదాయ రూపంలో ఉండే నిరంకుశత్వం కంటే, ప్రజాస్వామ్య సంస్కృతి నెమ్మదిగా క్షీణించడం గురించే అంబేడ్కర్ ఎక్కువగా భయపడ్డారు. రాజ్యాంగాలను రూపొందించవచ్చు, ఎన్నికలు నిర్వహించవచ్చు. కానీ గణతంత్రాలు అంతిమంగా ప్రజల ఆలోచనా విధానంపై ఆధారపడి ఉంటాయి. కఠినమైన ప్రశ్నలను అడగడానికి, అధికారం ఒకేచోట కేంద్రీకృతం కావడాన్ని అనుమానించడానికి, దేశం పట్ల భక్తికి, నాయకుడి పట్ల విధేయతకు మధ్య ఉన్న తేడాను గుర్తించడానికి సిద్ధంగా ఉన్న పౌరులపైనే అవి ఆధారపడతాయి.






# జూరాలకు నీటి విడుదలపై సానుకూలంగా స్పందించిన కర్ణాటక ప్రభుత్వం

## మహబూబ్‌నగర్ జిల్లా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు : ప్రజాప్రతినిధుల బృందం.

మహబూబ్‌నగర్ : జిల్లా రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల బృందం బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ని, కర్ణాటక నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ ఎన్. చలువరాయస్వామిని కలిసి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , పశుసంవర్ధక శాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి (GMR) , వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమై మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి పరిస్థితిని వివరించారు. నిన్న సాయంత్రం, నేడు ఉదయం కర్ణాటక ముఖ్యమంత్రితో జరిగిన సమావేశాల్లో ఎల్‌నినో ప్రభావం, జూరాల ప్రాజెక్టు వద్ద నీటి మట్టం, ఆయకట్టు రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి ఇబ్బందులను ప్రజాప్రతినిధులు వారికి వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి పై కర్ణాటక సీఎం శ్రీ. డీకే శివకుమార్ గారు సానుకూలంగా స్పందించి, కర్ణాటక నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ ఎన్. చలువరాయస్వామి గారు, కర్ణాటక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. షాలిని రాజనీష్ గారితో మాట్లాడి తెలంగాణకు నీటిని విడుదల చేసేలా అధికారులను ఆదేశించారు. కర్ణాటకలోనూ నీటి అవసరాలు, ఇబ్బందులు ఉన్నప్పటికీ తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సహకరిస్తామని సీఎం డీకే శివకుమార్ గారు హామీ ఇచ్చారు. కర్ణాటకలో వారాబంధీ విధానాన్ని అమలు చేస్తూ, అందుబాటులో ఉన్న నీటిని దశలవారీగా విడుదల చేస్తామని తెలిపారు. జూరాలతో పాటు భీమా, నెట్టెంపాడు, కోయిలాసాగర్ ప్రాజెక్టుల ఆయకట్టు పరిధిలోని రైతులు సాగునీటి పై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి గారి ఆదేశాల మేరకు ఈ నెల 20న తెలంగాణ సాగునీటి పారుదల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కర్ణాటక ముఖ్యమంత్రికి లేఖ రాశారని, కర్ణాటక ప్రభుత్వంతో నిరంతర సంప్రదింపులు కొనసాగిస్తూ జూరాలకు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కర్ణాటక ముఖ్యమంత్రి శ్రీ. డీకే శివకుమార్ గారికి, నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ ఎన్. చలువరాయస్వామి గారికి, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ ఎన్.ఎస్. బోస్‌రాజు గారికి, కర్ణాటక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీ (ఇరిగేషన్), సీఎం సలహాదారు మరియు ఇతర అధికారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రజాప్రతినిధుల బృందం కృతజ్ఞతలు తెలియజేశారు. రేపు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాప్రతినిధులతో సమావేశం. జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిలాసాగర్ ప్రాజెక్టుల సాగు, తాగునీటి అవసరాలపై రేపు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కర్ణాటక నుంచి వస్తున్న నీటిని... సాగు, తాగునీటి అవసరాలకు సమర్థవంతంగా ఎలా వినియోగించాలి, ఆయకట్టు రైతులకు ప్రయోజనం ఎలా కల్పించాలన్న అంశాలపై సమగ్రంగా చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు.



# జూరాల ఎడమ కాలువ వద్ద ప్రత్యేక పూజలు చేసి సాగునీరు విడుదల





**సమయం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర, మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి కృషి ఫలితంగా జూరాల ప్రాజెక్టు కింద ఉన్న రైతులకు సాగునీటి విషయంలో శుభవార్త అందింది. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్తో చర్చించి, జూరాల ప్రాజెక్టుకు సాగునీరు అందేలా మంత్రి డాక్టర్ వాకిటి శ ప్రత్యేకంగా కృషి చేశారు. వారి ఆదేశానుసారం జూరాల ఎడమ కాలువ ద్వారా సాగునీరు విడుదల కార్యక్రమాన్ని చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ, మత్స్యశాఖ, క్రీడలు మరియు యువజన శాఖల మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారం, జూరాల ఎడమ కాలువ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి సాగునీరు విడుదల కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా TG టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ మాట్లాడుతూ...జూరాల ఎడమ కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను స్వయంగా తెలుసుకున్న మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నగారు, సమస్యను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తో ఫోన్ ద్వారా మాట్లాడి, తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేల బృందంతో కర్ణాటక ప్రభుత్వంతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేయించారు. ఆ సమావేశంలో తెలంగాణ రైతుల సాగునీటి అవసరాలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పంటలకు నీటి ఆవశ్యకతను కర్ణాటక ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నెల రోజుల పాటు రోజుకు 5,000 వేల క్యూసెక్కుల చొప్పున సాగునీరు విడుదల చేయాలని కోరడం జరిగింది. రైతుల సమస్యపై సానుకూలంగా స్పందించి సాగునీటి విడుదలకు సహకరిస్తున్న కర్ణాటక ప్రభుత్వానికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాలువలకు చేరుతున్న నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, నీటి పంపిణీ విషయంలో సాగునీటి శాఖ అధికారుల సూచనలు, నీటి విడుదల షెడ్యూల్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే నిర్ధారణ లేని వార్తలు, అసత్య ప్రచారాలను నమ్మకుండా అధికారిక సమాచారం మరియు సంబంధిత సాగునీటి శాఖ అధికారుల సూచనల ఆధారంగానే నిర్ణయాలు తీసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అమరచింత కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు టి. రవికాంత్ , అమరచింత మున్సిపాలిటీ చైర్‌పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్ , మాజీ మండల అధ్యక్షుడు కేజీ మహేందర్ రెడ్డి , నందిమల్ల ఎక్స్ రోడ్ చుక్క ఆశిరెడ్డి , ఈర్లదిన్నె సర్పంచ్ వెంకట్ రెడ్డి , నందిమల్ల ఉపసర్పంచ్ శ్రీధర్ , గణేష్ గౌడ్ , ఆర్. వెంకటేశ్వర్ రెడ్డి , కురువ బాలరాజు గారు, మల్లేష్ గారు, చిన్న ఆశన్న , జి. ప్రదీప్ రెడ్డి, టి. నరసింహ , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జూరాల సాగునిరు విడుదల రైతుల విజయం CPM

అమరచింత : గత రెండు వారాలుగా జూరాల ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీటి విడుదల చేయాలని కోరుతూ రైతులు సిపిఎం కలిసి పోరాడి విజయం సాధించడం జరిగిందని వారు తెలిపారు.. అమరచింతలోని జిఎస్ భవనంలో పెరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జిఎస్ గోపి. జిల్లా కమిటీ సభ్యులు ఎస్ రాజు బి వెంకటేష్. సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు యస్ అజయ్ సిపిఎం పార్టీ మండల సీనియర్ నాయకులు. బుచ్చన్న శ్యామ్ సుందర్‌లు మాట్లాడుతజూరాల నుంచి నేడు నీరు విడుదల చేయడం రైతుల పోరాటానికి సిపిఎం మద్దతుగా ఆందోళనలు నిర్వహించడం తోటి రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చిందని వారు తెలిపారు. సాగునిరు విడుదల పట్ల సిపిఎం పార్టీగా హర్షం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో కర్ణాటక ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వం జరుపుతున్న చర్చల్లో ఆల్మట్టి డ్యాం నుండి జూరాల డ్యాంకు ఎన్ని టీఎంసీల నీరు అడుగుతున్నారు అనే దానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు అదేవిధంగా గత నెల రోజులుగా రాష్ట్రంలో నిలిచినటువంటి రైతు బీమా ఇన్సూరెన్స్ కు



ఎల్ఐసి కి ప్రభుత్వం ప్రీమియం కట్టకపోవడంతో రైతు బీమా అమలవుతుందా లేదా అనే ఆందోళనలో రైతు కుటుంబాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వ్యవసాయ శాఖ మంత్రి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందనిహితవు పలికారుగత బి ఆర్ ఎస్ హయంలో నిరంజన్ రెడ్డి మంత్రి గారు జూరాల నుండి నీళ్లు తరలించుకుపోయారని. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా డ్యామ్ పక్కలో ఉన్న గ్రామాలకు నీళ్లు వదలకుండా సుదుర ప్రాంతాలకు నీళ్లు తీసుకెళ్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. లిస్థానిక మంత్రి వాకిటీ శ్రీహరి చొరవ తీసుకొని డ్యాం పరిసర ప్రాంతాల చెరువులు రిజర్వాయర్లకు జూరాల నుంచి వదిలే నీరు ద్వారా నిండుగా నింపాలని డిమాండ్ చేశారు రైతులు పార్టీలు పోరాడితే తప్ప ప్రభుత్వం దిగివచ్చే పరిస్థితి లేదని విమర్శించారు. రైతుల ఉద్యమ పట్ల అక్రమ అరెస్టులు నిర్బంధాలు సరికాదని విమర్శించారు. ప్రజాపాలన అంటే ఇదేనా అని ప్రభుత్వ తీరును దుయ్యబట్టారులి రైతుల పంటలు చేతికొచ్చే వరకు జూరాల డాం ద్వారా సాగునీరు రోజువారీగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## కొనసాగుతున్న బీసీ రాజ్యాధికార యాత్ర

- ఏడవ రోజు



తాండూర్ : పరిగి నుంచి వికారాబాద్ వైపు బీసీ రాజ్యాధికార యాత్ర కొనసాగుతోంది. యాత్ర మార్గమధ్యలో పరిగి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన తీన్మార్ మల్లన్న విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. అనంతరం అభిమానులు, స్థానిక ప్రజలతో కలిసి ముందుకు సాగిన మల్లన్న.. వారితో సెల్ఫీలు దిగుతూ, కరచాలనం చేస్తూ పలకరించారు. ప్రజలతో మమేకమవుతూ సాగుతున్న బీసీ రాజ్యాధికార యాత్ర ప్రస్తుతం పరిగి నుంచి నస్కల్ వైపుగా కొనసాగుతోంది. బీసీ రాజ్యాధికారం లక్ష్యంగా మల్లన్న చేపట్టిన పాదయాత్ర ప్రస్తుతం 122 కిలోమీటర్లకు చేరుకుంది.

## నకిలీ పత్రాల దందాపై కొరడా!

**ఇద్దరు వైద్య విద్యార్థుల పత్రాలు రద్దు**
**హైదరాబాద్, మేడ్చల్ పాలనాధికారులకు అల్టిమేటం.**
**పత్రం ఇచ్చిన అధికారిపై, తండ్రులపై కేసు నమోదు చేయండి!**

హైదరాబాద్, సెప్టెంబర్ 23 : వరుస కథనాలతో తెలంగాణను కుదిపేస్తున్న నకిలీ షెడ్యూల్డు కుల (మాదాసి కుర్వా) ధృవీకరణ పత్రాల కుంభకోణంలో సంచలన పరిణామం చోటు చేసుకుంది. ఈ దందాను జాతీయ షెడ్యూల్డు కులాల సంఘం సుమోటోగా స్వీకరించి కీలక ఆదేశాలు జారీ చేసింది. విచారణలో ఇద్దరు వైద్య విద్యార్థులకు జారీ చేసిన నకిలీ పత్రాలను వెంటనే రద్దు చేయాలని హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పాలనాధికారులను ఆదేశించింది. ఈ ఇద్దరి పత్రాల్లో తీవ్ర పొంతన లేని అంశాలు ఉన్నాయని, తల్లిదండ్రుల పత్రాలు లేకుండా, చదువు ఆధారాలు లేకుండా, ఒక కుల సంఘం లేఖతో పత్రాలు జారీ అయ్యాయని సంఘం గుర్తించింది. తండ్రి వెనుకబడిన తరగతిగా ఉండి కొడుకు షెడ్యూల్డు కులం ఎలా అయ్యాడని ప్రశ్నించింది. పత్రం ఇచ్చిన అధికారిపై, తండ్రులపై కేసు నమోదు చేయండి! అధికారులకు ఆదేశించారు అని సమాచారం.

## 14 కొత్త రేషన్ షాపులకు డీలర్ల నియామకం



శాంతినగర్ : అలంపూర్ నియోజకవర్గ ప్రజలకు రేషన్ బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరింత సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు మొత్తం 14 కొత్త రేషన్ షాపులను ఏర్పాటు చేసి డీలర్లను నియమించినట్లు తెలిపారు. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్. ఎస్. ఏ. సంపత్ కుమార్ సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో మాట్లాడి ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా కొత్త రేషన్ షాపుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ క్రమం లో రేషన్ షాపుల డీలర్ల నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించగా, నియమి తులైన డీలర్లకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను బుధవారం శాంతినగర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో డాక్టర్. ఎస్. ఏ. సంపత్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. కొత్త రేషన్ షాపుల ద్వారా అలంపూర్ నియోజకవర్గంలోని ప్రజలకు రేషన్ సరుకుల పంపిణీ మరింత సులభతరం కానుందని తెలిపారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కొత్త ఆలోచనలు, సాంకేతికతతో రైతులు వ్యవసాయం చేయాలి






వనపర్తి. సమయం ప్రతినిధి : రోజు రోజుకు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కొంగొత్త ఆలోచనలు, సాంకేతిక మేళ వింపుతో రైతులు వ్యవసాయం చేయాలని అప్పుడే రైతులు లాభాలు ఆర్జిస్తారని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వనపర్తి జిల్లాలోని పద్మావతి శ్రీనివాస గార్డెన్ లో నిర్వహించిన కిసాన్ మేళ – 2026 కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కిసాన్ మేళలో ఆయా కంపెనీలు తాము రూపొందించిన మేలురకం విత్తనాలు, సోలార్ ఫెన్సింగ్, రసాయన మందులు, కోళ్లు, పొట్టేళ్ళు, గిరి జాతి ఆవులు, సమీకృత ఉద్యాన, పట్టు పరిశ్రమ, పామాయిల్, కిసాన్ క్రెడిట్ కార్డు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు ఈ కిసాన్ మేళాలో ప్రదర్శనకు ఉంచి రైతులకు వారి ఉత్పత్తులపై అవగాహన కల్పించగా జిల్లా కలెక్టర్ సైతం అన్ని స్టాల్లను సందర్శించి ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించారు.అనంతం ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమంలో కలెక్టర్ ప్రసంగిస్తూ వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ఒక ప్రణాళిక ప్రకారం కిసాన్ మేళాను ఏర్పాటు చేసి వేల సంఖ్యలో రైతులను మేళాను సందర్శించే విధంగా చేసినందుకు అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. కిసాన్ మేళా అనేది ఒక చక్కని కార్యక్రమం అని మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా దేశంలోని పరిశ్రమలు ఈ ప్రాంత వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉండే విధంగా కనుగొన్న కొత్త కొత్త వంగడాలు, రసాయన ఎరువులు, యాంత్రిక పరికరాలు ఒకే చోట స్టాల్స్ లో పెట్టి రైతులకు వ్యవసాయ పద్ధతులు, పండించే పంటల పై అవగాహన కల్పిస్తారని, వీటి ద్వారా రైతులు కొత్త ఆలోచనలతో లాభసాటి వ్యవసాయం చేసేందుకు దోహదపడతాయని తెలియజేశారు. ప్రతి మంగళవారం రైతు వేదికల ద్వారా వ్యవసాయ శాస్త్ర వేత్తలు పంటలు సాగు చేసే విధానము వాటికి వచ్చే చీడపురుగుల నివారణ లాభసాటి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తారని అందువల్ల రైతులు ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రస్తుత సంవత్సరము ఎల్ నీనో ప్రభావం వల్ల వర్షపాతం చాలా తక్కువగా నమోదు అయిందని గత సంవత్సరము ఈ సమయానికి 100 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైతే ఈ సంవత్సరము కేవలం 42 సెంటీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదయిందన్నారు. వరి పంట సాగుకు సరిపడా నీళ్ల లేకపోయే పరిస్థితి ఉన్నందున రైతులకు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని అనేక రకాలుగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పర్యావసానంగా గత సంవత్సరము వాన కాలంలో 2.25 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తే ఈ వాన కాలంలో 1.70 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు చేయడం జరిగింది అన్నారు. రైతులు వాతావరణానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సంవత్సరం జిల్లాలో మినుము పంట సాగు 30000 ఎకరాలకు ఎగబాకినందుకు అభినందించారు. పామాయిల్ పంట వల్ల చాలా లాభాలు ఉంటాయని కేవలము మూడు సంవత్సరాలు అంతర్ పంటలు వేసుకుంటూ పామాయిల్ సాగును కాపాడుకుంటే 30 సంవత్సరాల వరకు లాభాలు అర్థించవచ్చని తెలియజేశారు. వచ్చే సంవత్సరం వనపర్తి జిల్లాలో యూనిక్ పామ్ ఆయిల్ కంపెనీ ప్రారంభమవు తుందని అప్పుడు జిల్లాలోని పామాయిల్ క్రషింగ్ చేసి ఆయిల్ తీయడం జరుగుతుందన్నారు. తద్వారా రైతులకు మరింత లాభసాటిగా ఉంటుందని తెలియజేశారు. ఇప్పుడు వరి పండిస్తున్న రైతులు ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి తీస్తూ ఉండవచ్చు కానీ రాబోయే తరానికి ఆ భూమిలో 10 క్వింటాలు సైతం దిగుబడి సాధించలేరని అంతగా భూమి తన సారాన్ని పూర్తిగా కోల్పోతుందని తెలియజేశారు. రాబోయే తరానికి సారవంతమైన భూమిని అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని రైతులను కోరారు. ఈ సమావేశంలో మాట్లాడినజిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ రైతులకు కొత్త పద్ధతులు కొత్త వంగడాలు యాంత్రిక పరికరాలను పరిచయం చేయడమే కిసాన్ మేళ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రస్తుతము ఎల్ నీనో ప్రభావం వల్ల సాగు నీటి లభ్యత లేనందున యాసంగిలో రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ వాయిస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కె వి కె వ్యవసాయ శాఖ రాజేందర్ రెడ్డి, సాయిచరణ్ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేష్ చంద్రారెడ్డి ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ పద్ధతుల పై మాట్లాడి రైతులకు అవగాహన కల్పించారు.

## ప్రశాంతంగా.. ఘనంగా వినాయక నిమజ్జనం

**భారీ విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు**
**ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్**




జడ్చర్ల సెప్టెంబర్ 23, సమయం ప్రతినిధిజడ్చర్ల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఘనంగా కొనసాగింది. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ వినాయక విగ్రహాలను భక్తులు ఊరేగింపుగా తీసుకొచ్చి మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కృత్రిమ కొలనులో నిమజ్జనం చేశారు. నిమజ్జన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసుల పర్యవేక్షణలో నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా సాగింది.

## జూరాల రైతులకు సాగునీరు అందించే వరకు పోరాటం కొనసాగిస్తాం




వనపర్తి, సమయం ప్రతినిధి : రైతుల సమస్యలు తెలుసుకోవడానికి వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి అన్నారు. జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతుల సాగునీటి సమస్యలను తెలుసుకుని, రైతులకు అండగా నిలిచేందుకు జూరాల ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్‌రావును జడ్చర్ల వద్ద పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షులు డి నారాయణ,రాష్ట్ర నాయకులు అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆయనతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. బుధవారం తన నివాసంలో మాట్లాడుతూ అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి బిజెపి జిల్లా అధ్యక్షులు బి నారాయణ మాట్లాడుతూ.. రైతుల పక్షాన నిలబడి వారి సమస్యలను తెలుసుకోవడానికి వెళ్తున్న బీజేపీ నాయకులను అడ్డుకోవడం, అరెస్టులు చేయడం ద్వారా రైతుల సమస్యలు పరిష్కారం కావని అన్నారు. ప్రభుత్వం రైతులపై దృష్టి పెట్టి జూరాల ఆయకట్టు రైతులకు అవసరమైన సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు.బీజేపీ పోరాటం నేపథ్యంలో జూరాల నుంచి సాగునీటి విడుదల ప్రారంభమైందని, అయితే పంట చేతికి వచ్చే వరకు రైతులకు అవసరమైన నీటిని నిరంతరంగా విడుదల చేయాలని కోరారు. రైతుల పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు.అవసరమైతే కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి అదనపు నీటిని విడుదల చేయించేలా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కర్ణాటకతో సమన్వయం చేసుకుని రైతుల పంటలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రైతుల సాగునీటి సమస్య పరిష్కారం అయ్యే వరకు బీజేపీ రైతుల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రేచింతల శ్రీనివాసులు కదిరి మధు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో ఉద్రిక్తత.. భూముల రీ- సర్వేను అడ్డుకున్న గ్రామస్థులు

సమయం ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భూముల రీసర్వే'ను జిల్లాలోని మర్కూక్ మండల పరిధిలోని ఎర్రవల్లిలో నిర్వహించగా.. వెంకటాపూర్ గ్రామస్థులు అడ్డుకున్నారు. తమ గ్రామానికి సంబంధించిన 113 ఎకరాల భూమిని ఎర్రవల్లి గ్రామ రికార్డుల్లో నమోదు చేశారని వారు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు ఎర్రవల్లిలో రెవెన్యూ అధికారులు చేస్తున్న ఎంజాయ్‌మెంట్ సర్వేను అడ్డుకున్నారు. అనంతరం మర్కూక్ తహశీల్దార్ సరితను కలిసి వినతి పత్రం సమర్పించారు. సర్వే నంబర్ 325లోని తమ గ్రామానికి సంబంధించిన 113 ఎకరాల భూమిని ముందుగా క్షేత్రస్థాయిలో సర్వే చేసి.. హద్దులను నిర్ధరించిన తరువాతే.. వేరే భూమిని సర్వే చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై గ్రామస్థులంతా.. నిన్న(మంగళవారం)జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేయగా.. ఈ రోజు(బుధవారం) కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్లను కలిసి తమ గ్రామానికి సంబంధించిన భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు.

## ఆహార భద్రతపై అధికారులు కఠిన చర్యలకు సిద్ధం

**హాస్టళ్లు, పాఠశాలల్లో నెలకు రెండుసార్లు ఆకస్మిక తనిఖీలు**
**హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రతపై ప్రత్యేక నిఘా**
**నిబంధనలు ఉల్లంఘిస్తే నోటీసులు.. గడువు అనంతరం పునఃపరిశీలన**



వేకువ సమయం సెప్టెంబర్ 23 కీసర ప్రతినిధి : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందేలా ఆహార భద్రతా ప్రమాణాల చట్టం (FSS Act) నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ (DLAC) అధికారులను ఆదేశించింది. ఆహార కల్తీ, నాణ్యత లోపాలు, పరిశుభ్రతా ప్రమాణాల ఉల్లంఘనలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పెంచాలని సూచించింది. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ త్రైమాసిక సమీక్షా సమావేశంలో జిల్లాలో ఆహార భద్రత అమలు తీరుపై సమగ్రంగా సమీక్షించారు. ఆహార భద్రత నియంత్రణ, తనిఖీలు, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, వాటి పరిష్కారం, వివిధ సంస్థల్లో ఆహార నాణ్యత తదితర అంశాలపై చర్చించారు.

### హాస్టళ్లు, పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని కమిటీ స్పష్టం చేసింది. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో నెలకు కనీసం రెండు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించింది. వంటశాలల పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ, వంట విధానం, విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత తదితర అంశాలను తనిఖీల్లో పరిశీలించాలని సూచించింది. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే ఆహారం నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, ఆసుపత్రులు, వైద్య కళాశాలల క్యాంటీన్లలోనూ ఆహార భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### హోటళ్లపై ప్రత్యేక దృష్టి

హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ఆహార విక్రయ కేంద్రాల్లో పరిశుభ్రతా ప్రమాణాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని నిర్ణయించారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయం సమయంలో నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. పరిశుభ్రత లోపాలు, పారిశుద్ధ్య నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన వ్యాపార సంస్థలకు ముందుగా నోటీసులు, ఇంప్రూవ్‌మెంట్ లేదా షోకాజ్ నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. నోటీసులో పేర్కొన్న గడువు ముగిసిన అనంతరం సంబంధిత సంస్థలను తిరిగి తనిఖీ చేసి, లోపాలను సరిచేసుకున్నారా లేదా పరిశీలించాలని అధికారులకు సూచించారు.

### ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

ఆహార నాణ్యతకు సంబంధించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిశీలించి, అవసరమైన చోట తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని సమావేశంలో సూచించారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్నందున ఆహార భద్రత విషయంలో శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్,( స్థానిక సంస్థలు) పైజన్ అహ్మద్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా, కే.ఆనంద్ (DM&HO), జిల్లా విద్యాశాఖ అధికారి (ఐజూ), పంచాయతీ అధికారులు, జిల్లా ఆహార భద్రత నియమిత అధికారి (FSO)తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఆహార భద్రత ప్రమాణాల అమలును మరింత బలోపేతం చేసేందుకు క్రమం తప్పకుండా సమీక్షలు, తనిఖీలు కొనసాగించాలని నిర్ణయించారు.

## అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం - 2026 రాష్ట్రస్థాయి సన్మానాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ జిల్లా (సెప్టెంబర్ 23 వేకువ సమయం ప్రతినిధి); అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఓల్డర్ పర్సనల్) సందర్భంగా 2026 అక్టోబర్ 1వ తేదీన నిర్వహించనున్న కార్యక్రమాలలో భాగంగా, వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వయోవృద్ధులు వయోవృద్ధుల సంక్షేమం, రక్షణ, సంరక్షణ, సాధికారత కోసం విశేష కృషి చేసిన వ్యక్తులు, వయోవృద్ధుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు (ఎన్ జి ఓ ఎస్) తదితరులను రాష్ట్రస్థాయిలో సన్మానించేందుకు నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, కె. శిరీష , నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సన్మానాలకు అర్హత కలిగిన సీనియర్ సిటిజన్లు, వ్యక్తులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు/సంస్థలు తమ వివరాలను సమర్పించవచ్చునని నామినేషన్లో అభ్యర్థి/సంస్థ అందించిన సేవల వివరాలు, సేవల కాలవ్యవధి, సాధించిన విజయాలు, సమాజంపై చూపిన ప్రభావం, పొందిన అవార్డులు/గుర్తింపులు తదితర వివరాలతో పాటు సంబంధిత ధృవపత్రాలు, ఫోటోలు ఇతర ఆధారాలను జత చేయాలన్నారు. అర్హత కలిగిన వారు నిర్దేశిత నామినేషన్ ప్రొఫార్మాలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్థాయిలో పరిశీలన అనంతరం అర్హమైన నామినేషన్లను రాష్ట్రస్థాయికి పంపించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులు సమర్పించడానికి చివరి తేదీ: 26-09-2026. అర్హత మరియు నామినేషన్ ప్రొఫార్మా వివరాల కోసం జిల్లా సంక్షేమ అధికారి, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, మహబూబాబాద్ జిల్లా కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని అధికారి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## గంగారం, గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్



మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 23 వేకువ సమయం (ప్రతినిధి) : మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ బుధవారం గంగారం, గూడూరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమలు చేస్తున్న వివిధ కేంద్ర మరియు రాష్ట్ర ఆరోగ్య పథకాల రికార్డులను, అలాగే సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధనపై వైద్యాధికారితో సమీక్ష నిర్వహించి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే 0–5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా అవసరమైన మందులు, పరీక్షా కిట్లు తదితర వైద్య సామగ్రిని తగినంతగా అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారికి సూచించారు.జిల్లాలో జరుగుతున్న వినాయక నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాల ఏర్పాట్లను కూడా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమాల సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సిబ్బంది, మందులు మరియు ఇతర అత్యవసర వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గంగారం మండలంలోని వైద్యాధికారి డాక్టర్ కిరణ్, గూడూరు మండలంలోని వైద్యాధికారి డాక్టర్ పవన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# బీరంను పరామర్శించిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు

**కొల్లాపూర్, సమయం ప్రతినిధి:** కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి ఇటీవల స్వర్గస్థులైయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీష్ రావు , మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి , శ్రీనివాస్ గౌడ్ , సి. లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి , మర్రి జనార్ధన్ రెడ్డి ,చిట్టెం రామ్మోహన్ రెడ్డి రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్. ప్రవీణ్ , మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీను, అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి ,వాల్యా నాయక్ అభిలాష్ రావు ఈ రోజు సింగోటం గ్రామంలోని వారి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.బీరం లక్ష్మారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు.





# నేటి సాగునీటి కష్టాలకు ఎంపీ డీకే అరుణ - ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి కారకులు కాదా?




గద్వాల: సాగునీటి ప్రాంతంగా, వలసల ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన నడిగడ్డ ప్రాంతంలో నేటికీ రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని టీఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జి గొంగళ్ళ రంజిత్ కుమార్ ప్రశ్నించారు.ఏ నీళ్ల కోసం అయితే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామో, అదే నడిగడ్డ ప్రాంతంలో నేడు రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు.సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణానది నడిగడ్డ ప్రాంతం గుండా ప్రవహించినప్పటికీ, ఈ ప్రాంత రైతులకు ఆ నీటి పూర్తి ప్రయోజనం అందలేదని పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కృష్ణానది ప్రవహిస్తున్నా, అనేక ప్రాంతాలు కరువు, వలసలతో ఇబ్బందులు ఎదుర్కొన్నాయని అన్నారు.గతంలో వర్షాలు సమృద్ధిగా పడినప్పుడు రైతులకు నీరు అందిందని, అయితే వర్షాలు తగ్గినప్పుడు అసలు సాగునీటి సమస్య బయటపడుతోందని రంజిత్ కుమార్ అన్నారు."ఈ రోజు బీఆర్ఎస్ ప్రభుత్వం మేము అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితి రాలేదని అంటోంది. మరి ఇన్నేళ్లు మీ పాలనలో రిజర్వాయర్లు, కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఎందుకు పూర్తిస్థాయిలో నిర్మించలేకపోయారు?" అని ఆయన ప్రశ్నించారు.నెట్టెంపాడు పరిధిలోని రిజర్వాయర్లలో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసుకునేలా అవసరమైన నిర్మాణాలు ఎందుకు చేపట్టలేదని, సాగునీటి కాలువల వ్యవస్థను ఎందుకు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేకపోయారని ప్రశ్నించారు."మీరే కదా గత ప్రభుత్వంలో ఉన్నది? ప్రస్తుత ప్రభుత్వంలోనూ ఉన్నది? అధికారంలో ఉన్న సమయంలో రైతుల

**మీరే కదా గత ప్రభుత్వంలో ఉన్నది? ప్రస్తుత ప్రభుత్వంలోనూ ఉన్నది?**
**జూరాల ప్రాజెక్టు సందర్శనకే మంత్రులు వస్తారా? సమస్యను శాశ్వతంగా పరిష్కరించరా?**
**విలేకరుల సమావేశంలో టీఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జి గొంగళ్ళ రంజిత్ కుమార్.**

సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత మీపై లేదా?" అని రంజిత్ కుమార్ నిలదీశారు. తెలంగాణ రాష్ట్రాన్ని నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్నామని చెప్పుకుంటున్నప్పటికీ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు నడిగడ్డ రైతుల సాగునీటి కష్టాలను ప్రభుత్వాల దృష్టికి బలంగా ఎందుకు తీసుకెళ్లలేదని ఆయన ప్రశ్నించారు.ఓట్ల రాజకీయాలు, అధికారం కోసం రాజకీయాలు చేయడం తప్ప ప్రజల సమస్యల కోసం నిలకడగా పోరాడిన నాయకులు లేకపోవడం వల్లే నేటికీ నడిగడ్డ రైతులకు ఈ పరిస్థితి వచ్చిందని ఆయన అన్నారు."డీకే అరుణ గారు... గతంలో మీరు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు మీ హయాంలో రిజర్వాయర్లు ఎందుకు పూర్తి చేయలేదు? డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఎందుకు పూర్తి చేయలేదు? రైతులకు శాశ్వతంగా సాగునీరు అందించే వ్యవస్థను ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారు?" అని గొంగళ్ళ రంజిత్ కుమార్ ప్రశ్నించారు. "అభివృద్ధి కోసం పార్టీ మారానని చెబుతున్న కృష్ణమోహన్ రెడ్డికి నేడు రైతుల గోస ఎందుకు పట్టడం లేదు? నడిగడ్డ రైతులకు సాగునీరు అందించడం అభివృద్ధిలో భాగం కాదా? రైతులు పంటలు ఎండిపోతున్న సమయంలో వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, శాశ్వత పరిష్కారం కోసం ఎందుకు ఒత్తిడి చేయడం లేదు?" అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వం కూడా కేవలం జూరాల ప్రాజెక్టును సందర్శించి, అధికారులతో సమీక్షలు నిర్వహించడం వరకే పరిమితం కాకుండా రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు."మంత్రులు జూరాల ప్రాజెక్టు సందర్శనకు మాత్రమే వస్తారా? సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించరా?" అని ఆయన ప్రశ్నించారు. రైతులకు సాగునీరు అందేలా పెండింగ్‌లో ఉన్న రిజర్వాయర్లు, ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పనులను గుర్తించి, వాటిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని గొంగళ్ళ రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బుచ్చి బాబు, ప్రేమరాజు, మల్దకల్, అడవి ఆంజనేయులు, రమేష్, సుదర్శన్, సుభాష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

# బాలసదన్ పిల్లల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

## వసతి, విద్య, ఆరోగ్యం, రక్షణ సౌకర్యాలపై DLSA పరిశీలన

వేకువ సమయం సెప్టెంబర్ 23 కీసర ప్రతినిధి : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ బాలసదన్‌లోని పిల్లల సంక్షేమం, రక్షణ, విద్య, ఆరోగ్య పరిస్థితులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (DLSA) అధికారులు సమగ్రంగా పరిశీలించారు. జిల్లా జడ్జి వి. బాలభాస్కర్ రావు ఆదేశాల మేరకు ఋూూా సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్. ప్రియాంక బాలసదన్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బాలసదన్‌లో పిల్లలకు అందుతున్న వసతి, భోజనం, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, విద్య, భద్రత, ఇతర మౌలిక సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. పిల్లలతో కొంతసేపు మాట్లాడి వారి దైనందిన జీవనం, అవసరాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పిల్లలు తమ సమస్యలను స్వేచ్ఛగా తెలియజేసేలా వారితో స్నేహపూర్వకంగా మాట్లాడారు.

**రికార్డుల పరిశీలన**

బాలసదన్‌లో పిల్లలకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు, నిర్వహణ పత్రాలను కూడా జడ్జి ప్రియాంక పరిశీలించారు. పిల్లల సంరక్షణకు సంబంధించిన వివరాలు సక్రమంగా నమోదు చేస్తున్నారా, వారి అవసరాలు ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరిస్తున్నారా అనే అంశాలను పరిశీలించారు. బాలల హక్కులు, రక్షణకు సంబంధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సిబ్బందికి సూచించారు.

**న్యాయ సహాయం అందేలా చర్యలు**

బాలసదన్‌లో ఉన్న ప్రతి చిన్నారికి నాణ్యమైన సంరక్షణ, విద్య, ఆరోగ్య సేవలు, భద్రతతో పాటు అవసరమైన న్యాయ సహాయం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జడ్జి ప్రియాంక సూచించారు. పిల్లల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా




వాటిని గుర్తించి సంబంధిత శాఖల సహకారంతో పరిష్కరించాలని తెలిపారు. బాలల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారి విద్యాభివృద్ధి, మానసిక భద్రత, ఆరోగ్యం, సామాజిక రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు. పిల్లల హక్కులకు భంగం కలగకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు కె. నాగజ్యోతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఇంతియాజ్ రహీం, నారపల్లి ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ సౌమ్య, బాలసదన్ సూపరింటెండెంట్ భవాని, DCPU సిబ్బంది, బాలసదన్ హోం సిబ్బంది పాల్గొన్నారు.

# త్రాగునీరు సమస్యను పరిష్కరించండి.....CPM




అమరచింత : మున్సిపాలిటీ ఆఫీస్ ముందు ధర్నా సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు బి వెంకటేష్ కౌన్సిలర్ మాధవి కోఆప్షన్ సభ్యులు నూర్జహాన్ బేగం మాట్లాడుతూ బీసీ కాలనీ లో7వ వార్డు త్రాగునీరు సమస్య తీవ్రంగా ఉంది పలుమార్లు ఆఫీసర్ల దృష్టికి తీసుకెళ్లిన సమస్య శాశ్వత పరిష్కారం కావడం లేదు కావున అధికారులు తాగునీరు సమస్యపై ప్రత్యేకమైన దృష్టి సారించి బీసీ కాలనీలో తాగునీల సమస్య రాకుండా చూడాలని డిమాండ్ చేశారు మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం వేసిన మంచినీళ్ల బోర్లను రిపేరు చేయించి ప్రత్యేక దృష్టి పెట్టాలని మిషన్ భగీరథ నీళ్ల పై మాత్రమే ఆధార పడకుండా మంచినీళ్ల బోర్లలో నూతన మోటర్లు బిగించి బోర్లను డ్రిల్లింగ్ చేయాలని కోరారు సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లితే ఇంకా ఒక్కసారి సమస్య రాకుండా చూస్తామని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు డిసి రాజేందర్ రవి అంజి కాలనీవాసులు జాలికి పద్మ భాగ్యమ్మ సావిత్రి రాణి లత రేఖ శైలజ సుజాత స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జిల్లా జనరల్ ఆసుపత్రిలో ఘనంగా ఉచిత ఆరోగ్య శిబిరం

## 412 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు, ఆయుష్ మందుల పంపిణీ




మహబూబాబాద్ జిల్లా (సెప్టెంబర్ 23 వేకువ సమయం ప్రతినిధి) : 11వ అంతర్జాతీయ ఆయుష్ (ఆయుర్వేద) దినోత్సవం సందర్భంగా బుధవారం మహబూబాబాద్ జిల్లా జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఆయుష్ శాఖ సంచాలకులు మరియు ప్రాంతీయ ఉప సంచాలకుల ఆదేశాల ప్రకారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ... ఈ ఉచిత ఆరోగ్య శిబిరంలో 412 మందికి పైగా రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలకు అనుగుణంగా ఉచితంగా ఆయుర్వేద మరియు హోమియోపతి మందులను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. అంతేకాకుండా, వివిధ రుగ్మతలతో బాధపడుతున్న బాధితులకు వారి వ్యాధుల తీవ్రతను బట్టి ప్రత్యేక యోగాసనాలు మరియు యోగా శిక్షణను కూడా అందజేయడం జరిగింది.

**విశేషంగా ఆకట్టుకున్న మూలికా మొక్కల ప్రదర్శన:** శిబిరంలో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆయుర్వేద ఔషధ మొక్కల ప్రదర్శన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంది. వివిధ రకాల నిత్య జీవితంలో ఉపయోగపడే మూలికలు, వాటి వైద్య విలువలు మరియు ఆరోగ్య ప్రయోజనాల గురించి ప్రజలకు వివరంగా తెలియజేశారు. ఈ ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఈ సందర్భంగా ఆయుష్ వైద్య విధానాల విశిష్టతను రోజువారీ జీవితంలో యోగా యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ శిబిరంలో డాక్టర్ సుజాత, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ రామకృష్ణ, డిపియం శ్రవణ్ కుమార్, సిబ్బంది కిషన్, ప్రవీణ్, సోములు, రవీందర్, వీరన్నలతో పాటు యోగా శిక్షకులు హేమ సుందర్ కమల్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# చమురు రంగంలో తెలుగు సంస్థలు



సమయం ప్రతినిధి : దేశ సరిహద్దులకు ఆవల ప్రపంచవ్యాప్తంగా భారత వాణిజ్య విజయం అంటే సహజంగా ఐటీ రంగ దిగ్గజ సంస్థలే గుర్తుకు వస్తాయి. ఈ సంస్థలు సకాలంలో మెరుగైన సేవలు అందించి లాభాలు ఆర్జిస్తున్నాయి; భారత యువజనులకు పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్నాయి; మరీ ముఖ్యంగా భారతీయుల ప్రతిభా పాటవాలకు అంతర్జాతీయంగా ఎనలేని గుర్తింపును సాధిస్తున్నాయి. ఈ కారణంగానే సమకాలీన భారతీయ వాణిజ్య విజయాలకు ఐటీ సంస్థలు ప్రతీకలుగా వెలుగొందుతున్నాయి. ఇటీవల కొంతకాలంగా ఐటీ సంస్థలకు అదనంగా భారతీయ ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల సంస్థలూ విదేశాలలో విజయవంతంగా విస్తరిస్తున్నాయి. ఇది శుభ పరిణామం. ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రపంచంలో అగ్రభాగాన నిలిచే చమురు నిక్షేపాల నెలవులు అయిన గల్ఫ్ అరబ్బు దేశాలలో ఈ సంస్థలు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాయి. వాస్తవానికి భారతీయ ఇంజినీరింగ్, నిర్మాణ రంగ సంస్థలకు అరబ్బు దేశాలు కొత్త కాదు. చమురు ఎగుమతి ఆరంభ కాలం (1970వ దశకం)లో టాటా గ్రూప్ భాగస్వామి అయిన అగ్రగామి కాంట్రాక్టింగ్ కంపెనీ 'షాపుర్జీ పల్లోంజీ' గల్ఫ్ దేశాలలో సివిల్ నిర్మాణాలను విరివిగా చేపట్టింది. ఈ ఎడారి దేశాలలో మట్టి సరిగ్గా అందుబాటులో ఉండదు. దీంతో అవసరమైన మట్టిని షాపుర్జీ పల్లోంజీ కంపెనీ భారతదేశం నుంచి నౌకలలో తీసుకువచ్చేది. అప్పుడే ఆ కంపెనీ యువ ఇంజినీరు ఎ.పి.జితేందర్ రెడ్డిని కూడా ఉద్యోగ వీసాపై గల్ఫ్‌కు తీసుకువచ్చింది. సుదీర్ఘకాలం అరబ్బు దేశాలలో ఉన్న జితేందర్ దేశానికి తిరిగి వెళ్లి పార్లమెంటుకు పోటీ చేసి ఎన్నికయ్యారు. ఎలక్ట్రో--మెకానికల్ రంగంలో ప్రముఖ భారతీయ సంస్థ 'ఎల్ అండ్ టీ' పూర్తి చేసిన 65 బిలియన్ డాలర్ల విలువైన పనులలో దాదాపు సగం సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్ దేశాలకు చెందినవే కావడం విశేషం. ఎడారి ఉష్ణోగ్రతలో ఎయిర్ కండిషన్ ఇంజినీరింగ్ భారీ కాంట్రాక్టులను ప్రపంచ దిగ్గజ బహుళజాతి సంస్థలతో పోటీపడి ఎల్ అండ్ టీ విజయవంతంగా పూర్తిచేసింది. మారుమూల ఇసుక ఎడారుల గుండా హై వోల్టేజీ విద్యుత్ లైన్ల నిర్మాణంలో కూడా ఎల్ అండ్ టీ తన విశిష్టతను చాటింది. గల్ఫ్ దేశాలలో పైపులైను వ్యవస్థ అత్యంత కీలకమైనది. నీటి వనరులు లేని ఈ ఎడారి దేశాలలో వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్ర తీరం నుంచి శుద్ధి చేసిన ఉప్పు నీటిని నగరాలకు సరఫరా చేయడం, చమురును నౌకాశ్రయాల వరకు రవాణా చేయడానికి పైపులు ప్రధాన ఆధారాలు. ఈ పైపుల నిర్మాణం, సరఫరా పనుల్లో భారతీయ సంస్థలే ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. చమురు పైపుల నిర్మాణం, నిర్వహణలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన నిపుణులు పెట్టింది పేరు.గల్ఫ్ దేశాలు అంటే చమురు, గ్యాస్‌కు మారుపేరు. ఈ దేశాలలో ప్రతి వ్యవస్థ ఈ రంగంతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అనుసంధానమై ఉంటుంది. నిరంతర విస్తరణ, నిర్వహణ పనులు ఉండే ఈ రంగంలో ఇప్పటి వరకు భారతీయ సంస్థలు ఏవీ కూడా పోటీపడలేదు. సాధారణంగా అమెరికా, జర్మనీ, బ్రిటన్ దేశాల ఇంజినీరింగ్ సంస్థలే ఇందులో సదా అగ్రగాములుగా ఉంటాయి. ప్రప్రథమంగా భారతీయ సంస్థలు అందునా తెలుగు రాష్ట్రాలకు చెందిన సంస్థలు చమురు రంగంలో సాహసోపేతంగా అడుగుపెడుతున్నాయి. చమురు ఉత్పాదకతలో విడుదలయ్యే వివిధ రసాయనాలను వేరు చేస్తూ నికర చమురును తీయడం ఒక ముఖ్య ప్రక్రియ. ఇందుకు అవసరమైన ప్లాంట్లను సాధారణంగా పాశ్చాత్య దేశాల సంస్థలు మాత్రమే నిర్మిస్తాయి. ఈ రకమైన నిర్మాణ పనుల కాంట్రాక్టును హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజినీరింగ్ సంస్థ కువైత్‌లో దక్కించుకుని ప్రపంచ ఇంజినీరింగ్ సంస్థలను ఆశ్చర్యానికి గురిచేసింది. 381 మిలియన్ డాలర్ల ఈ కాంట్రాక్టు చమురు రంగంలో భారతీయ సంస్థల ప్రాబల్యానికి ఒక తిరుగులేని నిదర్శనం. ఇంతకు ముందూ కువైత్ చమురు సంస్థ నౌకదానిలో 225 మిలియన్ డాలర్ల కాంట్రాక్టును మేఘా సంస్థే దక్కించుకుంది. సౌదీలో 300 కిలోమీటర్ల పైపు లైను ద్వారా మక్కా పుణ్యక్షేత్రానికి ఐదు లక్షల క్యూసెక్కుల మంచి నీరు సరఫరా చేసే అర్హత పొందిన సంస్థల జాబితాలో కూడా మేఘా ఉన్నది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రోగ్రెసివ్, రాంకీ, జి.యం.ఆర్ సంస్థలు గతంలో వివిధ రంగాలలో కొన్ని పనులు చేసినా కీలకమైన చమురు రంగంలో మేఘా ప్రవేశమే భారతీయ కంపెనీలకు ఒక కొత్త ప్రారంభమని చెప్పవచ్చు. భారత వాణిజ్య విజయాలలో ఇదొక ఉజ్వల అధ్యాయం. ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ ఐటీ సంస్థల జైత్రయాత్రను ఇంజినీరింగ్ సంస్థలూ కొనసాగించాలి.

# కరువు వస్తే బీఆర్ఎస్‌లో సంబరాలు

# రైతు కన్నీటిలో ఓట్లు వెతకడం నీచ రాజకీయం





**సమయం ప్రతినిధి, నల్లగొండ :** 'ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న వేళ రైతులకు ధైర్యాన్ని, భరోసానివ్వాల్సిన ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్.. కరువు రావాలని, పంటలు ఎండిపోవాలని కోరుకుంటూ పైశాచికానందం పొందుతోంది' అని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆకాశంలో ఎల్‌నినో వర్షాలను అడ్డుకుంటే.. భూమిపై బీఆర్ఎస్ అబద్ధాల వరద పారిస్తోందని మండిపడ్డారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో రూ. 26.40 కోట్ల వ్యయంతో నిర్మించిన నేరేడుచర్ల–దూపాడు డబుల్ రోడ్డుతో పాటు, జానల్‌దిన్నె గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, రూ. 33 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని మంత్రి బుధవారం ప్రారంభించారు. మొత్తం రూ. 26.93 కోట్ల వ్యయంతో పూర్తయిన అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రకృతి కారణంగా ఏర్పడిన వర్షపాత లోటును కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరిస్తూ బీఆర్ఎస్ దివాలాకోరు రాజకీయం చేస్తోందని మంత్రి విమర్శించారు. "ఎల్‌నినో అనేది కాంగ్రెస్ కార్యాలయంలో పుట్టిన పదం కాదు. ప్రపంచవ్యాప్తంగా పసిఫిక్ మహాసముద్రంలో జరిగే మార్పుల వల్ల ఏర్పడే శాస్త్రీయ పరిణామం. దీనివల్ల రుతుపవనాల ప్రభావం తగ్గి కొన్ని దశల్లో వర్షపాతం 40 శాతం వరకు తగ్గింది. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి ప్రతిపక్షం విషప్రచారం చేస్తోంది. రైతు పొలంలో పంట ఎండిపోతే ప్రభుత్వానికి బాధ కలుగుతుంది.. కానీ బీఆర్ఎస్‌కు మాత్రం రాజకీయ అవకాశం కనిపిస్తోంది. రైతు కన్నీటిలో ఓట్లు వెతకడం కంటే నీచమైన రాజకీయం మరొకటి ఉండదు" అని దుయ్యబట్టారు.

> **ఎల్‌నినోను రాజకీయ ఆయుధంగా మార్చుకుని ప్రతిపక్షం విషప్రచారం**
> **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**
> **రూ. 26.93 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం**
> **జూరాల పంటలను కాపాడేందుకు శివకుమార్‌తో మంతనాలు**

### కర్ణాటక నీళ్ల కోసం డి.కె. శివకుమార్‌తో చర్చలు

జూరాల ఆయకట్టు కింద సాగు చేసిన ఖరీఫ్ పంటలను కాపాడేందుకు కర్ణాటక నుంచి నీటిని విడుదల చేయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. తనకున్న వ్యక్తిగత స్నేహంతో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి/సిఎం డి.కె. శివకుమార్‌తో మంతనాలు జరిపానని, ఆయన కూడా సానుకూలంగా స్పందించి నీటి లభ్యతను బట్టి సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఒకవైపు తాము పొలాలను కాపాడేందుకు పొరుగు రాష్ట్రాల తలుపు తడుతుంటే.. బీఆర్ఎస్ నేతలు మాత్రం రైతుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగు చేసిన ప్రతి ఎకరా పంటనూ కాపాడేందుకు నీటిపారుదల శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని మంత్రి స్పష్టం చేశారు. జలాశయాల్లో ఉన్న నీటిని పొదుపుగా వాడుకుంటూ, రాబోయే వేసవి కాలంలో ప్రజలకు మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళికతో ముందడుగు వేస్తున్నామన్నారు.

### ఈ ప్రాంతంతోది ప్రేమానుబంధం

హైదరాబాద్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ' సన్నాహక సమావేశం ఉన్నప్పటికీ నేరేడుచర్ల ప్రజల కోసం ఇక్కడికి వచ్చానని మంత్రి చెప్పారు. నూతన రోడ్డు నిర్మాణంతో నేరేడుచర్ల, పత్తేపురం, వైకుంఠపురం, రామలక్ష్మీపురం, మేడారం, బక్కయ్యగూడెం, దూపాడు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగవుతుందన్నారు. "మీ శ్రమ, ఆదరాభిమానాలతోనే నేను 6 సార్లు శాసనసభకు, ఒకసారి లోక్‌సభకు ఎన్నికయ్యాను.. ఈ రుణాన్ని అభివృద్ధితోనే తీర్చుకుంటాను" అని భావోద్వేగంగా పేర్కొన్నారు. పార్టీకి కార్యకర్తలు, నాయకులే వెన్నెముక అని పేర్కొంటూ, ఇటీవల నిర్వహించిన కోదాడ మెగా జాబ్ మేళా ద్వారా వందలాది మంది యువతకు ఉపాధి లభించడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. బీఆర్ఎస్ చేసే అవాస్తవ ప్రచారాన్ని కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

## హేమాద్రి దేవస్థానంలో ఘనంగా విఘ్నేశ్వరుడి నిమజ్జన మహోత్సవం

**రూ.32 వేలతో గణపతి లడ్డూ వేలం దక్కించుకున్న మాజీ సర్పంచ్ దంపతులు**



వేకువ సమయం సెప్టెంబర్ 23కీసర ప్రతినిధి :కీసర మండలం రాంపల్లి దాయరలోని వెంకులోని గుట్ట హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ విఘ్నేశ్వరుడి నిమజ్జన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తుల ఆధ్యాత్మిక ఉత్సాహం నడుమ నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీ విఘ్నేశ్వరుడి లడ్డూ వేలంపాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేలంపాటలో మాజీ సర్పంచ్ దంపతులు శ్రీ గరుగుల ఆండాళ్–మల్లేష్ రూ.32,000లకు లడ్డూను దక్కించుకున్నారు. వారికి, వారి కుటుంబ సభ్యులకు విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని దేవస్థానం ట్రస్ట్ సభ్యులు ఆకాంక్షించారు.కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు కామసాని వసంత–బాల్ రెడ్డి, కందాడి సుధారాణి–పురుషోత్తం రెడ్డి, కామసాని అనిత––శ్రీనివాస్ రెడ్డి, రామిడి మానస–రాజిరెడ్డి, స్వరూప–నాగిరెడ్డి, గాడి స్వప్న–రాము, గుండే బోయిన సుభాష్ తదితరులు పాల్గొన్నారు. మహోత్సవాన్ని విజయవంతం చేసిన భక్తులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ ట్రస్ట్ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం



జడ్చర్ల సెప్టెంబర్ 23, సమయం ప్రతినిధి: 75–జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో ఎస్ఐఆర్–2026 ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ), ఈఆర్ఓ హరిప్రియ తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 23 నాటికి 93.59 శాతం నోటీసుల పంపిణీ, 45.33 శాతం విచారణలు పూర్తయినట్లు మిగిలిన విచారణలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏఈఆర్ఓ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న ఫారం–6, 7, 8 దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఓటర్లు విచారణలకు హాజరై సహకరించేలా అవగాహన కల్పించాలని ప్రతినిధులను కోరారు. సమావేశంలో తహసీల్దార్/ఏఈఆర్ఓ, అదనపు తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్, ఎన్నికల డీటీ తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 23 : నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని పాత రాయవరం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై ఆవు మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎదుల సురంజి గౌడ్‌కు చెందిన ఆవు పొలంలో మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ సుమారు రూ.1 లక్ష వరకు ఉంటుందని బాధిత యజమాని తెలిపారు. ఘటనపై సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది లైన్మెన్ జలీల్, నరేష్ గౌడ్, కృష్ణ, బాలకృష్ణ, శివ తదితరులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఆవును కోల్పోయిన తనను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు ఎదుల సురంజి గౌడ్ కోరారు.

## కరెంటు పేరుతో కేసీఆర్ మార్క్ అవినీతి కేటీఆర్ ముందు చరిత్ర తెలుసుకో..

- ఉచిత విద్యుత్‌పై కాంగ్రెస్‌దే పేటెంట్ హక్కు
- డిస్కంలను రూ.81 వేల కోట్ల అప్పుల్లో నెట్టింది బిఆర్ఎస్సే
- పవర్ ప్రాజెక్టుల్లో రూ.కోట్ల అవినీతి జరిగింది నిజం కాదా?
- ఎల్ నినో కరువును సర్కార్‌పై నెట్టి రాజకీయ లబ్ధికి కుట్ర
- బీఆర్ఎస్ నేతల పవర్ ప్లాంట్ల సందర్శన డ్రామా
- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఫైర్



సమయం ప్రతినిధి, నల్లగొండ : రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందనే భయాందోళనలు సృష్టించేందుకు బిఆర్ఎస్ నేతలను ఆరు బృందాలుగా విభజించి పవర్ స్టేషన్ల వద్దకు పంపుతూ డ్రామాలు ఆడుతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ విద్యుత్ ఛార్జీల కోసం పోరాటం చేశారని కేటీఆర్ పచ్చి అబద్ధాలు చెప్తున్నారని, ముందు ఆయన చరిత్ర తెలుసుకోవాలని హితవు పలికారు. '2000 సంవత్సరంలో చారిత్రాత్మక బషీర్ బాగ్ విద్యుత్ ఉద్యమ కాల్పులు జరిగినప్పుడు కేసీఆర్ టిడిపిలోనే ఉన్నారు. ఆయనకు మంత్రి పదవి ఇవ్వకుండా కేవలం డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చారనే అసంతృప్తితోనే 2001లో టిడిపి నుంచి బయటకు వచ్చారన్నది చేదు నిజం. నిజానికి రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత, దానిపై పూర్తి పేటెంట్ హక్కు ఒక్క కాంగ్రెస్ పార్టీదే" అని చామల స్పష్టం చేశారు. కేసీఆర్ ఇకనైనా పిట్ట కథలు చెప్పడం బంద్ చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో విద్యుత్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టారని చామల ఆరోపించారు. బిఆర్ఎస్ హయాంలో చేసిన చేతకాని పరిపాలన వల్ల డిస్కంలపై ఏకంగా రూ. 81,000 కోట్ల అప్పుల భారం పడిందన్నారు. ఇతర రాష్ట్రాల్లో అత్యంత తక్కువ ధరకు విద్యుత్ లభించే అవకాశాలున్నా.. కమీషన్ల కోసం ఛత్తీస్‌గఢ్ నుంచి 1,000 మెగావాట్ల విద్యుత్‌ను అధిక ధరలకు కొనుగోలు చేస్తూ కుమ్మక్కు ఒప్పందాలు చేసుకున్నారన్నారు. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఆధునిక 'సూపర్ క్రిటికల్ టెక్నాలజీ'ని కాదని, పాత పద్ధతి అయిన 'సబ్ క్రిటికల్ టెక్నాలజీ'ని వాడి నిబంధనలకు విరుద్ధంగా రూ. 1,000 కోట్ల ప్రజాధనాన్ని నష్టం చేశారని, యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ఓపెన్ బిడ్డింగ్ పెట్టకుండా నామినేషన్ పద్ధతిలో బిహెచ్ఈఎల్‌కు కట్టబెట్టి భారీగా కమీషన్లు దండుకున్నారని పేర్కొన్నారు. ప్రాజెక్టుల పేరుతో ఏ ప్రాజెక్టు వద్ద ఎంత అవినీతికి పాల్పడ్డారో కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద పూర్తి లెక్కలు ఉన్నాయని, మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డికి అన్ని ఫామ్‌హౌస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### ఎల్ నినో కరువుపై శవ రాజకీయాలు: ఎంపీ చామల

ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుంటే.. దాంతో వచ్చిన కరువును కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టాలని బిఆర్ఎస్ కుట్ర చేస్తోందని ఎంపీ చామల కిరణ్ ధ్వజమెత్తారు. "రైతులకు మేలు జరగాలని కోరుకోవాల్సింది పోయి, విపత్తు వేళ రైతులను రెచ్చగొట్టి పంటలు వేయించి వారిని ఆగం చేయాలని భావిస్తున్నారు. తమకు ఓట్లు వేయలేదనే కక్షతోనే రైతులపై, ప్రజలపై బిఆర్ఎస్ కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది" అని దుయ్యబట్టారు. ఫామ్‌హౌస్ అక్రమాల బాగోతాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేటీఆర్ ఈ నాటకాలకు తెరలేపారని విమర్శించారు. రైతులు కేవలం వరిపైనే కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టేలా ప్రభుత్వం అవగాహన కల్పిస్తోందని, ప్రజలకు, రైతులకు నిరంతరం ఉచిత విద్యుత్ అందించడమే కాంగ్రెస్ లక్ష్యమని పేర్కొన్నారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను 10 ఏళ్లలో అప్పులమయం చేసిన బిఆర్ఎస్ నేతల అక్రమాల ఫైళ్లను రాబోయే రోజుల్లో ఒక్కొక్కటిగా బయటపెడతామని, బిఆర్ఎస్ నాటకాలను రైతులు, ప్రజలు ఎప్పటికీ క్షమించరని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

## మహబూబాబాద్ డీ.ఎస్, సి ఎస్.సీ.డీ.ఎస్, ఈడీగా వీ. ఉపేంద్ర బాధ్యతల స్వీకరణ



మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 23:మహబూబాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కాస్ట్స్ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీ.ఎస్సీ,ఎస్,సీ,డీ,ఎస్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వీ. ఉపేంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు మహబూబాబాద్ జిల్లాలో పోస్టింగ్ లభించింది.ఇంతకుముందు ఆమె ఖమ్మం జిల్లాలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డ్ కాస్ట్ డెవలప్‌మెంట్ (ఎస్ సి పి) శాఖ ద్వారా జారీ చేసిన (జి, ఓ, ఆర్, టి ,నం.233,)తేదీ: 11.09.2026లో రాష్ట్రంలోని మూడు షెడ్యూల్డ్ కాస్ట్స్ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీలకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్‌లు కేటాయించింది.ఇందులో భాగంగా వీ. ఉపేంద్రను మహబూబాబాద్ ఋజూజఋ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

### ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పోస్టింగ్

ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఖమ్మంలో జుూ, (డీ.ఎస్, సి ఎస్,సీ,డీ,ఎస్) గా పనిచేస్తున్న వీ. ఉపేంద్రకు మహబూబాబాద్ (డీ.ఎస్, సి ఎస్,సీ,డీ,ఎస్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఈ పోస్టింగ్ ప్రస్తుతం ఉన్న ఖాళీకి అనుగుణంగా చేపట్టినట్లు ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. అలాగే పదోన్నతి పొందిన అధికారులు తమకు కేటాయించిన పోస్టుల్లో 15 రోజుల్లోగా విధుల్లో చేరాలని,సంబంధిత శాఖాధికారులు, జిల్లా కలెక్టర్లు తదుపరి అవసరమైన చర్యలు తీసుకుని అధికారులు విధుల్లో చేరినట్లు ప్రభుత్వానికి అనుగుణ నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### ఎస్సీ సంక్షేమంపై దృష్టి

మహబూబాబాద్ జిల్లాలో ఎస్సీ వర్గాల సామాజిక,ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం (డీ.ఎస్, సి ఎస్,సీ,డీ,ఎస్) ప్రధాన బాధ్యతల్లో ఒకటి,ఈ నేపథ్యంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన వీ. ఉపేంద్ర ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ, ఆర్థిక సహాయ పథకాలపై అర్హులైన లబ్ధిదారులకు అవగాహన కల్పించడం, దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక, పథకాల అమలులో పారదర్శకత, క్షేత్రస్థాయి పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందన్నారు.

### సిబ్బంది అభినందనలు

బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కార్యాలయ సిబ్బంది, అధికారులు వీ. ఉపేంద్రకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్సీ సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా (డీ.ఎస్, సి ఎస్,సీ,డీ,ఎస్) కార్యకలాపాలను మరింత ప్రజలకు సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



# ఫైబ్రాయిడ్స్‌కు సర్జరీ ఒక్కటే పరిష్కారమా?

**నలభై ఏళ్ల వయసులో, చిన్న చిన్న ఫైబ్రాయిడ్స్ కనిపించినా, ఎలాంటి రక్తస్రావం, నొప్పి, అసౌకర్యం లేకపోతే సర్జరీ చేయించుకోవలసిన అవసరం ఉండదు. ఫైబ్రాయిడ్ పరిమాణం, వాటితో తలెత్తే సమస్యలను బట్టి సర్జరీ అవసరమా, లేదా అనేది వైద్యులు నిర్ణయిస్తారు. అయితే ఫైబ్రాయిడ్స్ ఉన్నంత మాత్రాన సర్జరీ చేయించుకోవలసిన అవసరం లేదు. బదులుగా ఇతరత్రా చికిత్సలు కూడా తీసుకోవచ్చు. చిన్న చిన్న ఫైబ్రాయిడ్ల ను కలిగి ఉండీ, గర్భాశయం చిన్నదిగా ఉండీ, అధిక రక్తస్రావం అవుతూ ఉంటే మెడికల్ ట్రీట్మెంట్ ప్రయత్నించవచ్చు. ఈ చికిత్సలో భాగంగా కొన్ని మందులను మూడు నెలల పాటు వాడుకోవచ్చు.**

వీటితో కాలేయం మీద ప్రభావం పడే అవకాశం ఉంటుంది కాబట్టి, ప్రతి నెలా కాలేయ పరీక్షలు చేయించుకుంటూ, ఫలితాన్ని బట్టి మాత్రల వాడకాన్ని కొనసాగించవలసి ఉంటుంది. ఈ మాత్రలతో కొందరికి ఉపశమనం దొరుకుతుంది. కొందరికి ఈ మాత్రలు పని చేయకపోవచ్చు.

సర్జరీలు ఈ సందర్భంలో: నొప్పితో పాటు, రక్తస్రావం అవుతూ ఉంటే, ఫైబ్రాయిడ్ స్థానాన్ని, పరిమాణాన్నీ పరీక్షించవలసి ఉంటుంది. ఒకవేళ ఫైబ్రాయిడ్ గర్భాశయ క్యావిటీలో ఏర్పడితే, సర్జరీ తప్పనిసరి అవుతుంది. సబ్‌మ్యూకస్ ఫైబ్రాయిడ్‌లను హిస్ట్రోస్కోపీ, సబ్‌మ్యూకస్ ఇంట్రామ్యూరల్ అయితే ల్యాప్రోస్కోపీ, ఓపెన్ సర్జరీలను వైద్యులు ఎంచుకుంటారు. కేవలం ఫైబ్రాయిడ్‌నే తీయించుకోవాలనుకుంటే, అలాంటి సర్జరీని ఎంచుకోవచ్చు. పిల్లలు కలిగి ఉన్న వాళ్లు వద్దు అనుకుంటే గర్భాశయాన్ని కూడా తొలగించుకోవచ్చు. కానీ నలభై ఏళ్ల వయసులో గర్భాశయంతో పాటు ఓవరీలను తీయించుకోకూడదు.

మెరీనా పరికరం: 'మెరీనా' అనే ఇంట్రాయుటెరైన్ డివైసతో కూడా ఈ సమస్యకు అడ్డుకట్ట వేయవచ్చు. ఈ పరికరం ద్వారా విడుదలయ్యే హార్మోన్ వల్ల గర్భాశయంలో ఫైబ్రాయిడ్స్ పెరుగుదలకు తోడ్పడే లోపలి పొర పెరగకుండా ఆగిపోతుంది. దాంతో రక్తస్రావం తగ్గిపోతుంది. చిన్న చిన్న ఫైబ్రాయిడ్స్ ఉండీ, రక్తస్రావం ఎక్కువగా ఉన్న వాళ్లు ఈ పరికరాన్ని ఎంచుకోవచ్చు. మెనోపాజ్ దశకు చేరువలో ఉండీ, గర్భాశయం చిన్నదిగానే ఉండీ, ఫైబ్రాయిడ్స్‌తో ఎటువంటి ఇతర అసౌకర్యాలేవీ లేనివాళ్లు మెడికల్ ట్రీట్మెంట్‌ను అనుసరిస్తూ, కొంత కాలం పాటు వేచి చూడవచ్చు. ఈ చికిత్సతో ఫలితం లేనప్పుడు, అంతిమంగా మాత్రమే సర్జరీని ఎంచుకోవాలి. ఫైబ్రాయిడ్స్ చాలా పెద్దవిగా ఉండి, గర్భాశయం 10 సెంటీమీటర్ల కంటే పెద్దదిగా ఉన్నప్పుడు మాత్రలతో పాటు, మెరీనా పరికరం కూడా పని చేయకపోవచ్చు. అలాంటప్పుడు సర్జరీ అవసరం పడుతుంది. సర్జరీ వద్దు అనుకునేవాళ్లు యుటెరిన్ ఫైబ్రాయిడ్ ఎంబొలైజేషన్‌ను కూడా ఎంచుకోవచ్చు. అలాగే ఎమ్మార్ హైఫు ద్వారా ఫైబ్రాయిడ్లను కరిగించుకోవచ్చు.



# కథ కంచికి వెళ్లిపోకుండా...

**మంచిని బోధించిన ఒకప్పటి కథలు క్రమేపీ కాలగర్భంలో కలిసిపోవడం సహించలేని హైదరాబాద్‌కు చెందిన ప్రియా చౌదరి, వాటిని కొత్త మార్గాల్లో నేటి పిల్లలకు పరిచయం చేయాలని కంకణం కట్టుకుంది. ఆ క్రమంలో 'విను మరీ' పేరుతో, ఆడియో పుస్తకాలు, సాధారణ పుస్తకాలు, యూట్యూబ్‌ల ద్వారా అలనాటి మేటి కథలను వినిపిస్తూ, శ్రోతల మనసులను గెలుచుకోవడం మొదలు పెట్టింది. కొవిడ్ కాలంలో మొదలై నేటికీ నిరాఘాటంగా సాగుతున్న ఆ కథా ప్రయాణం ఆమె మాటల్లోనే....**

అమ్మ చెప్పే కథ ఎంత కమ్మగా ఉన్నా, ఒక్కోసారి పిల్లల ఏకాగ్రత చెదురుతూ ఉంటుంది. అది గ్రహించిన అమ్మ, 'కథ చెప్పమని అడిగావు కదా, 'విను మరీ' అంటూ పిల్లల్లో తిరిగి ఆసక్తిని నింపుతుంది. ఈ మాట ప్రతి ఇంట్లో వినిపించేదే కాబట్టి నా కథా ప్రయాణానికి ఆ మాటనే ఎంచుకున్నాను. చిన్నప్పుడు నాన్నగారు, విజయవాడ, చెన్నై నుంచి కథల పుస్తకాలు తెప్పించేవాళ్లు. అమ్మా నాన్న ఇద్దరూ కథలు చెప్పేవాళ్లు. అలా పుస్తకాలు చదువుతూ, కథలను వింటూ ఎన్నో విలువలను నేర్చుకున్నాను. కథ మంచి అలవాట్లను నేర్పించాలి. నీతిని బోధించాలి. అన్నిటికంటే ముఖ్యంగా జీవన నైపుణ్యాలను మెరుగుపరచాలి. అలాంటి కథలు క్రమేపీ మరుగున పడిపోతున్నాయి. ఆ కథలను తిరిగి పిల్లలకు, పెద్దలకూ పరిచయం చేయాలనే ఆలోచనతో 2020 కొవిడ్ కాలంలో ఈ ప్రయత్నానికి పూనుకున్నాను.

## ప్రముఖుల తోడ్పాటుతో...

చిన్నప్పటి నుంచీ వ్యాసాలు రాయడం అలవాటు. హిందూ దినపత్రికలో, పిల్లల కథల పుస్తకాల్లో ప్రచురితమయ్యాయి. ఈ ఆసక్తి వయసుతో పాటు పెరిగింది. దీనికి అమ్మ ప్రోత్సాహం కూడా తోడైంది. అలా ప్రారంభంలో ఆడియో స్టోరీ బుక్స్‌తో శ్రీకారం చుట్టాను. కథ వినే వారికి పదజాలం, పద ఉచ్ఛారణ మెరుగుపడాలి. అలాగే భావం తెలియాలి. కాబట్టి గాయకులు శ్రీకృష్ణ, గోపిక పూర్ణిమ, తనికెళ్ల భరణి కథలకు స్వరాలనిచ్చారు. కార్తీక్ సంగీత దర్శకత్వం వహించారు. తమిళంలో సైంధవి ఇవే కథలను వినిపించారు. ఈ ప్రయత్నానికి నటులు రాణా తోడ్పాటు కూడా ఎంతో ఉంది. ఇలా ప్రముఖుల ప్రమేయంతో ఆడియో బుక్స్ అన్నిటినీ శ్రోతలకు వీలైనంత చేరువ చేయగలిగే ప్రయత్నానికి పూనుకున్నాను. శ్రీకృష్ణ గారు.. వేమన పద్యాలు, పిట్ట కథలు, జై వీరాంజనేయ ఆడియోలకు తన గొంతును అందిస్తే, ఆయన, వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్ శిల్ప కలిసి సాయి పారాయణం ఆడియో బుక్‌కు సహాయపడ్డారు. అలా ఆడియోబుక్స్, శ్రీరామ, శ్రీకృష్ణుడు పేపర్‌బ్యాక్ బుక్స్ ప్రచురించాం. ఆ తర్వాత వేమన పద్యాలతో పాటు పర్ల్స్ ఆఫ్ విజ్‌డమ్, ప్యారీ ఛోటీ కహానీ మొదలైన పుస్తకాలను తెలుగు, హిందీ, తమిళం, ఇంగ్లీషు భాషల్లో ప్రచురించి, దేశ వ్యాప్తంగా కొన్ని సంస్థలకు, పాఠశాలలకూ, పిల్లలకు చేరుతుందనుకున్న ప్రతి ప్రదేశంలో డొనేట్ చేశాం. అన్ని కుటుంబాలకూ కథల పుస్తకాలు కొనేంత స్థోమత లేకపోవచ్చు కాబట్టి కిరణ్ బేడీ ఇండియా విజన్, తమిళనాడులో అగరం ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ ఫౌండేషన్‌కు ఆ పుస్తకాలను అందచేశాం. పర్ల్స్ ఆఫ్ విజ్‌డమ్ పుస్తకావిష్కరణ చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా జరిగింది.

## ఊహలకు రెక్కలు తొడగడం కోసమే...

తాజాగా చాణక్య నీతి ప్రాజెక్టు పనిలో ఉన్నాను. దీన్లో తనికెళ్ల భరణి గారు సంస్కృతంలో శ్లోకం చెప్తే, 11 ఏళ్ల పాప ఇంగ్లీషులో ఆ శ్లోకానికి అర్థం చెప్పి, అనుబంధంగా కథ చెప్తుంది. ఇప్పటి పిల్లలకు చాణుక్యుడి గురించి తెలియదు. ఆయన స్థాపించిన తక్షశిల విశ్వవిద్యాలయంలో బోధించిన బోధనలు మనుషులు భూమి మీదున్నంతకాలం ఉపయోగపడతాయి. వీళ్లిద్దరితో కలిపి పంచతంత్ర కథలను కూడా రూపొందిస్తున్నాం. అయితే కథలన్నిటినీ పుస్తకాలకూ ఆడియో బుక్స్‌కే పరిమితం చేయడానికి కూడా ఓ కారణం ఉంది. కథ విన్నప్పుడు ఆ కథలోని పాత్రలను ఎవరికి నచ్చినట్టు వాళ్లు ఊహించుకునే వెసులుబాటు చిక్కుతుంది. కానీ వీడియోలో మనం చూపించే పాత్రలే మనసుల్లో ముద్రించుకుపోతాయి. నాకది ఇష్టం లేదు. ప్రతి ఒక్కరి ఊహాశక్తి భిన్నంగా ఉంటుంది. కాబట్టి ఊహలకు రెక్కలు తొడగడం కోసమే ఇలా ఆడియో బుక్స్‌కే పరిమితమయ్యాను. ఈ కథలతో ప్రధానంగా పిల్లలకెన్నో ప్రయోజనాలు దక్కుతాయి. జీవన నైపుణ్యాలు మెరుగుపడతాయి. ఉదాహరణకు పంచతంత్ర పుస్తకాన్నే తీసుకుంటే, దాన్లో లెక్కలేనన్ని జీవననైపుణ్యాలు మనకు కనిపిస్తాయి. వేమన పద్యాలన్నీ ఆర్థిక సలహాలు, జీవన నైపుణ్యాల సమాహారాలే! ప్రస్తుతం, యాపిల్, ఆడిబుల్, స్టోరీటెల్, యూట్యూబ్‌ల, స్పాటిఫై ద్వారా ఆడియో బుక్స్‌ను అందిస్తున్నాను. మన దేశంతో పాటు విదేశాల్లోని అనేక మంది శ్రోతలు ఈ ఆడియోబుక్స్‌కు అభిమానులుగా మారుతూ ఉండడం సంతోషంగా ఉంది.

## పిల్లలకు ఇంగ్లీషు నవలలా?

ఓసారి పార్కులో కూర్చున్నప్పుడు నాకు కొద్ది దూరంలో ఉన్న ఒక మహిళ, తొమ్మిదో తరగతి చదువుతున్న తన కూతురికున్న పుస్తక పఠనాసక్తి గురించి మరొక మహిళకు గొప్పగా వివరిస్తోంది. వాళ్ల సంభాషణను చెవులు రిక్కించి వినకపోయినా, ఆ మాటలు నా చెవిలో పడుతున్నాయి. అనుకోకుండా ఆమె నా దగ్గరకొచ్చి పలుకరించి, మాటలు కలిపింది. నేనప్పుడు 'మీ పాప పంచతంత్ర చదివిందా?' అని అడిగాను. 'మా అమ్మాయి అవన్నీ చదవదు. కేవలం ఇంగ్లీష్ నవలలే చదువుతుంది' అని చెప్పింది. ఆ అమ్మాయి, ఇంగ్లీష్ నవలా రచయిత సిడ్నీ షెల్డన్ పుస్తకాలు చదువుతోందని తర్వాత, ఆమె మాటల ద్వారా తెలిసింది. అసలా పుస్తకంలో ఏముంటుందో కూడా తల్లికి తెలియకపోవడం, చక్కని తెలుగు కథా పుస్తకాలను వదిలేసి, ఇంగ్లీషు నవలలు చదివే కూతురి గురించి ఆ తల్లి గొప్పగా చెప్పుకోవడం నాకెంతో బాధేసింది. పైగా 'ఈ పుస్తకంలో ఉన్నదానికీ, నిజజీవితంలో జరుగుతున్నదానికీ సంబంధం లేదేంటి?' అని కూతురు అడిగే ప్రశ్నకు తల్లి సమాధానం చెప్పలేకపోతున్నట్టు కూడా ఆమె మాటల ద్వారా గ్రహించాను. పిల్లలు ఇంగ్లీషు పుస్తకాలు చదవడం తప్పు కాదు. కానీ వాళ్ల వయసుకు తగ్గట్టు లియో టాల్‌స్టాయ్, యూసప్స్ ఫేబుల్స్, ఎనిడ్ బ్లైటన్ కథల పుస్తకాలు కూడా ఉన్నాయి. వాటికి బదులుగా పెద్దలకు ఉద్దేశించిన నవలలు చదవడం ఎంతవరకూ సమంజసం? గతంతో పోలిస్తే, నేడు పిల్లలకు సేఫ్ టచ్ గురించి బోధించేటంత దారుణమైన స్థితికి చేరుకున్నాం. కథలు వినడం, చదవడం వల్ల ఈ అంశం పట్ల అవగాహన పెరుగుతుంది. చదువు ప్రాముఖ్యం తెలిసొస్తుంది. తల్లితండ్రులు, గురువుల పట్ల గౌరవం పెరుగుతుంది. స్నేహ ధర్మం విలువ తెలుస్తుంది.

## అంధుల కోసం బ్రెయిలీలో...

చిన్న జియర్‌స్వామి గారి ఆశ్రమానికి చెందిన నేత్ర విద్యాలయలో పాక్షిక అంధ బాలబాలికలున్నారు. వాళ్ల కోసం బ్రెయిలీలో పుస్తకం ప్రచురించాను. వేద పాఠశాలలో పిల్లలకు ఆడియో బుక్స్ అందించాను. ముమ్ముందు అంధ పిల్లలకూ, కథల పుస్తకాలు కొని చదివే వీల్లేని పిల్లలందరికీ ఆడియో బుక్స్ అందించాలని ఉంది. మరణానికి చేరువైన వ్యక్తులకు ఆశ్రయమిచ్చే హాస్పైస్ కేర్‌లో గ్రంథాలయానికి కూడా పుస్తకాలు అందించాను. అలాగే స్టోరీ టెల్లింగ్ సెషన్ కూడా చేశాను.



## టాప్‌లో.. మహేష్ 12.. నాని 12

బాక్సాఫీస్ వద్ద నేచురల్ స్టార్ నాని విధ్వంసం మొదలైంది. ఆయన హీరోగా నటించిన తాజా మాసివ్ చిత్రం 'ద ప్యారడైజ్' విడుదలకు ముందే రికార్డుల వేట ప్రారంభించింది. 'దసరా' వంటి సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ తర్వాత నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ మళ్లీ రిపీట్ కావడం, దానికి తోడు రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూరడంతో ఈ చిత్రంపై మొదటి నుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అడ్వాన్స్ సేల్స్ రూపంలోనే ఇప్పటికే రూ. 43 కోట్ల గ్రాస్ మార్కును అధిగమించి ట్రేడ్ వర్గాలను విస్మయానికి గురిచేయగా, సెప్టెంబర్ 23న ప్రీమియర్లతో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి అడుగుపెడుతోంది. ముఖ్యంగా ఓవర్సీస్‌లో నాని మార్కెట్ స్టామినా మరోసారి ఘనంగా రుజువైంది. అమెరికా మార్కెట్‌లో 'ద ప్యారడైజ్' చిత్రం కేవలం ప్రీమియర్ అడ్వాన్స్ సేల్స్‌తోనే 1 మిలియన్ డాలర్ల క్లబ్‌లోకి దూసుకెళ్లి సరికొత్త రికార్డును నమోదు చేసిందని పంపిణీదారులు అధికారికంగా వెల్లడించారు. ఈ ఘనతతో యూఎస్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక 1 మిలియన్ డాలర్ల చిత్రాలు కలిగిన రికార్డులో సూపర్ స్టార్ మహేష్ బాబు సరసన నాని సగర్వంగా నిలిచారు. ఇద్దరి ఖాతాల్లోనూ చెరో 12 చిత్రాలు చేరడం విశేషం. కంటెంట్‌ను నమ్ముకుని ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చిన నాని, నేడు స్టార్ హీరోలందరినీ దాటుకుంటూ యూఎస్ మార్కెట్‌లో అగ్రపీఠాన్ని మహేష్ బాబుతో పంచుకోవడం ఆయన ఓవర్సీస్ ఫ్యాన్ బేస్‌కు నిదర్శనం. ప్రీమియర్లతోనే ఈ స్థాయి వసూళ్లు రాబట్టడంతో, రానున్న రోజుల్లో 'ద ప్యారడైజ్' మరిన్ని భారీ కలెక్షన్లతో చరిత్ర సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.



## రాధ ఫిర్యాదు పై అంబిక వెర్షన్ ఏంటంటే..

దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు స్టార్ సిస్టర్స్ గా ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న ప్రముఖ నటీమణులు రాధ, అంబికల మధ్య మొదలైన ఆర్థిక, ఆస్తి వివాదం మరింత ముదిరి.. సంచలనంగా మారింది. సంతకం చేసిన తన ఖాళీ చెక్కులను దొంగిలించి ఏకంగా రూ. 46 కోట్లు కాజేసేందుకు ప్రయత్నించారంటూ రాధ ఇటీవల చెన్నై పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించి, తన సోదరి అంబికతో పాటు సోదరుడు మల్లికార్జునపై క్రిమినల్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ తీవ్ర ఆరోపణలపై నటి అంబిక తాజాగా గళం విప్పారు. తనపై వచ్చిన అభియోగాలన్నింటినీ తీవ్రంగా ఖండిస్తూ, రాధ ఫిర్యాదును న్యాయపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధమంటూ బహిరంగంగా సవాల్ విసిరారు. నాలుగు గోడల మధ్య పరిష్కరించుకోవాల్సిన కుటుంబ వివాదాన్ని మీడియా ముందుకు తీసుకురావడం తీవ్ర బాధ కలిగించిందని అంబిక ఆవేదన వ్యక్తం చేశారు. రాధ నివాసంలోని గదిలోకి చొరబడి తాను చెక్కులను దొంగిలించాననడంలో ఎంతమాత్రం వాస్తవం లేదని తేల్చిచెప్పారు. అసలు రాధకు తెలియకుండా ఆమె గదిలో నుంచి చెక్కులు ఎలా తీసుకోగలమని ప్రశ్నించిన అంబిక, స్వయంగా రాధే ఆ చెక్కులను తనకు అందజేసిందని వెల్లడించారు. "చెక్కులను స్వయంగా ఇచ్చింది రాధే.. ఆ తర్వాత బ్యాంకుకు వెళ్లి పేమెంట్లను ఉద్దేశపూర్వకంగా ఆపేసింది కూడా రాధే" అని స్పష్టం చేశారు. సొంత తోబుట్టువు అయి ఉండి తనపై దొంగతనం నేరం మోపడం మానసికంగా ఎంతో కలచివేసిందని పేర్కొన్నారు. ఈ చెక్కుల వివాదం వెనుక సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న కుటుంబ ఆస్తులు, వ్యాపార లావాదేవీల అంశాలు ఉన్నాయని అంబిక వివరించారు. ముఖ్యంగా ARS గార్డెన్స్'తో తమ కుటుంబానికి దశాబ్దాల అనుబంధం ఉందని, ఆ సంస్థను తన కన్నబిడ్డలా భావించానని భావోద్వేగానికి లోనయ్యారు. అటువంటి సంస్థ పేరును తన ప్రమేయం లేకుండా RR గార్డెన్స్'గా మార్చడం తనను ఎంతగానో క్షోభకు గురిచేసిందన్నారు. అలాగే ఆస్తులు, వ్యాపారంతో పాటు బంగారు ఆభరణాల విషయంలోనూ తమ మధ్య చాలాకాలంగా విభేదాలు ఉన్నాయని, తమ కుటుంబానికి చెందిన విలువైన బంగారు నగలు కూడా రాధ వద్దే ఉన్నాయని ఆమె ఎదురు ఆరోపణలు చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి తాను గతంలోనే సంబంధిత అధికారులను సైతం ఆశ్రయించానని గుర్తుచేశారు. మరోవైపు, ఈ వ్యవహారంలో చట్టపరమైన పోరాటానికి అంబిక సిద్ధమయ్యారు. రాధ ఇచ్చిన చెక్కులు బ్యాంకులో బౌన్స్ కావడంతో, ఆమెపై చట్టప్రకారం న్యాయపరమైన చర్యలు చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు అంబిక తరఫు న్యాయవాది స్పష్టం చేశారు. రాధ పోలీసులకు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదును న్యాయస్థానంలో గట్టిగా సవాలు చేస్తామని తెలిపారు. ఇకపై ఈ కుటుంబ సమస్యను పదేపదే మీడియా ముందుకు తీసుకురాబోనని, చట్టం, అధికారుల నిర్ణయానికే తుది న్యాయాన్ని వదిలేస్తున్నానని అంబిక స్పష్టం చేయడంతో, ఈ స్టార్ సిస్టర్స్ లీగల్ వార్ కోలీవుడ్‌తో పాటు దక్షిణాదిలో హాట్ టాపిక్‌గా మారింది.



## నాన్న కుట్టి ఎప్పుడంటే...

సంగీత దర్శకుడి నుంచి నటుడిగా టర్న్ అయిన వ్యక్తి విజయ్ ఆంటోని. తొలి చిత్రం నుంచి భిన్నమైన కథాంశాలకే ఆయన ప్రాధాన్యం ఇస్తున్నారు. అంతేకాదు... తన చిత్రాల ద్వారా ఏదో స్థాయిలో చక్కని సందేశాన్ని ఇవ్వడానికీ ప్రయత్నిస్తున్నారు. మహిళల పునర్ వివాహం నేపథ్యంలో విజయ్ ఆంటోని నిర్మించిన 'వంద దేవుళ్ళు' సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తాజాగా ఆయన మరో డిఫరెంట్ కథను ఎంచుకున్నారు. ఫాదర్ అండ్ డాటర్ సెంటిమెంట్‌తో ము. మారన్ దర్శకత్వంలో విజయ్ ఆంటోనీ హీరోగా చేస్తున్న చిత్రం 'నాన్న కుట్టి' . యాక్షన్, కుటుంబ భావోద్వేగాలు, ఇంటెన్స్ డ్రామాగా ఈ మూవీని రూపొందిస్తున్నారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద మీరా విజయ్ ఆంటోని నిర్మాతగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ మూవీకి సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ అధినేత రామంజనేయులు జవ్వాజీ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'నాన్న కుట్టి' సినిమా చిత్రీకరణ పూర్తయ్యి, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. ఈ సినిమాను అక్టోబర్ 16న విడుదల చేయబోతున్నట్టు తాజాగా మేకర్స్ తెలిపారు. ఈ చిత్రంలో ప్రీతి అస్రాని, లిథన్య, భగవతి పెరుమాళ్, హరిప్రియ ఇసై, అరువి మధన్, చిత్ర లక్ష్మణన్, శ్రీజ రవి, వెట్టై ముత్తుకుమార్, జెన్సన్ దివాకర్, మురుగానందం, మున్నార్ రమేష్, లిస్సీ ఆంటోని, కుమార్ నటరాజన్, విజయన్, ప్రవీణ, హరిత, హరిప్రియ తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. రాజీవ్ రాజేంద్రన్ సినిమాటోగ్రఫర్‌గా పని చేయగా, కథానాయకుడు విజయ్ ఆంటోనీ దీనికి సంగీతం అందించడంతో పాటు ఎడిటింగ్ బాధ్యతలూ నిర్వర్తిస్తున్నారు. ఎ. రాజా ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వర్తించారు. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్, భావోద్వేగ కథనం, హృద్యమైన సంగీతం, ఆకట్టుకునే స్క్రీన్‌ప్లేతో 'నాన్న కుట్టి' చిత్రం రానుంది. ఈ చిత్రం ప్రేక్షకులకు ఉత్కంఠభరితమైన, భావోద్వేగభరితమైన, మరపురాని థియేట్రికల్ అనుభవాన్ని అందిస్తుందని చిత్ర బృందం విశ్వసిస్తోంది.

# Cinema



## బెత్లెహాం... నెక్స్ట్ టార్గెట్ పెద్ది!

చిన్న సినిమాతో జనాలు కనెక్ట్ అయితే... వాటి కలెక్షన్స్ సునామీని తలపిస్తాయి. ఆ మధ్య మలయాళ చిత్రం 'లోక' బాక్సాఫీస్ బరిలో అలాంటి సునామీనే సృష్టించింది. ఎవరూ ఊహించనవి విధంగా 300 కోట్లకు పైగా గ్రాస్ ను ఆ సినిమా వసూలు చేసింది. కళ్యాణీ ప్రియదర్శిని నటించిన ఆ సినిమా విడుదలైనప్పుడు ఎవ్వరూ ఆ స్థాయి విజయాన్ని అస్సలు ఊహించలేదు. కానీ అందరి అంచనాలను తల్లకిందులు చేస్తే 'లోక' బ్లాక్ బస్టర్ గా సాగింది. ఈ యేడాది దక్షిణాది చిత్రాలలో ఇంతవరకూ అత్యధిక గ్రాస్ ను వసూలు చేసిన సినిమాగా రామ్ చరణ్ 'పెద్ది' 334.20 కోట్లు వసూలు చేసి నిలిచింది. ఆ తర్వాత స్థానం ప్రస్తుతం తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నటించిన చివరి చిత్రం 'జననాయగన్'ది. ఈ సినిమాకు డివైడ్ టాక్ వచ్చినా... 323.95 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. చిత్రం ఏమంటే... ఈ ఇద్దరితో పోల్చితే ఎలాంటి ఇమేజ్ లేని మలయాళ నటుడు నివిన్ పౌలీ నటించిన 'బెత్లెహెం కుటుంబ యూనిట్' మూవీ ఏకంగా రూ. 323 కోట్లను కేవలం 32 రోజుల్లో వసులూ చేసింది. అంతే ఒకటి రెండు రోజుల్లో ఈ సినిమా 'జన నాయగన్' కలెక్షన్స్ ను దాటేస్తుంది. ఆ రకంగా చూసినప్పుడు ఇక నెక్స్ట్ టార్గెట్ 'పెద్ది' సినిమానే అని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'బెత్లెహెం కుటుంబ యూనిట్' వివిధ భాషల్లోకి అనువాదమై అక్కడా మంచి కలెక్షన్స్ ను రాబట్టుతోంది. దాంతో ఖచ్చితంగా ఇది కాస్త అటూ ఇటూగా 350 కోట్ల గ్రాస్ వసులు చేస్తుందనే తెలుస్తోంది. అదే జరిగితే.. ఈ యేడాది ఇప్పటి వరకూ దక్షిణాదిన ఈ ఫీట్ ను సాధించిన తొలి చిత్రంగా 'బెత్లెహెం కుటుంబ యూనిట్' నిలుస్తుంది. అలానే కేవలం కేరళలోనే ఈ సినిమా రూ. 150 కోట్ల గ్రాస్ ను కలెక్ట్ చేసింది. విశేషం ఏమంటే... 'జన నాయగన్', 'పెద్ది' చిత్రాల బడ్జెట్ తో పోల్చితే 'బెత్లెహెం కుటుంబ యూనిట్' చాలా తక్కువలో నిర్మించినట్టే. అయితే హృదయానికి హత్తుకునేలా ఈ రొమాంటిక్ కామెడీ సినిమాను దర్శకుడు తెరకెక్కించడంతో యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులూ ఈ మూవీతో కనెక్ట్ అయ్యారు. పైగా 'ప్రేమలు'కు ఇది సీక్వెల్ గా ఉందంటూ కామెంట్స్ రావడం, ఈ రెండు సినిమాలను గిరీషే తెరకెక్కించడం... ఇందులోనూ మమితా బైజూనే హీరోయిన్ కావడం బాగా కలిసొచ్చింది.



## జానీ మాస్టర్ వైఫ్ పై దాడి అసలేం జరిగిందంటే..

హైదరాబాద్‌లోని ఫిలింనగర్ పరిధిలో గల తెలుగు ఫిల్మ్ ఛాంబర్ వేదికగా డ్యాన్సర్స్ అసోసియేషన్ వివాదం తారాస్థాయికి చేరి ఉద్రిక్తతలకు దారితీసింది. తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్‌లో కొంతకాలంగా సాగుతున్న అంతర్గత విభేదాల నేపథ్యంలో, తెలుగు ఫిల్మ్ ఫెడరేషన్ కీలక నిర్ణయం తీసుకుంటూ ప్రస్తుత అధ్యక్షురాలు, ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ భార్య అయిన సుమలత పాలకవర్గాన్ని రద్దు చేసిన సంగతి తెలిసిందే. మొత్తం 225 మంది సభ్యులు హాజరైన భేటీలో సుమలతకు కేవలం 11 మంది మద్దతు మాత్రమే లభించగా, రఘు మాస్టర్ వర్గానికి ఏకంగా 214 మంది మద్దతు ప్రకటించడంతో ఫెడరేషన్ ఈ రద్దు నిర్ణయాన్ని ప్రకటించి, వచ్చే నెల అక్టోబర్ 11న అసోసియేషన్‌కు నూతన ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించింది. అయితే ఈ ఎన్నికల ప్రకటన వచ్చిన కొద్ది గంటల్లోనే ఇరువర్గాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085